// # సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన : (0863) 2293280, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి

మిస్.పి. ఇందిరాదేవి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి

Volume 30 Issue 12
No.of Pages 40
AUGUST 2011

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్స్ పంపవలసిన చిరునామా:

మేనేజరు
సమర్థసద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

## ఈ సంచికలో....

| | పేజీ |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మ ఆశీస్సులు | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 7 |
| సన్నిధిలో సంభాషణ | 10 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 13 |
| శ్రీగురుదక్షిణ | 15 |
| శ్రీగురు కృపాహి కేవలమ్ | 17 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 19 |
| పరిప్రశ్నేన సేవయా | 21 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 22 |
| భగవత్సాక్షాత్కారము | 24 |
| వార్తలు-విశేషాలు | 27 |
| సమర్థ సద్గురు నాధుని దివ్యచరిత్ర | 28 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 30 |
| శత్రువుల పట్ల ఉదాత్తమైన కృప | 33 |
| అమెరికాలో మాతాజీ బోధ | 35 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

## భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

**ఇన్ద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా।** (భగవద్గీత)
శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి బోధ చేస్తూ ఇంద్రియాలలో మనస్సు, ప్రాణులలో చైతన్యము లేక ఎరుక నేనే అని స్పష్టంగా తెలియజేశారు. శ్రీమాతాజీ భక్తులకు బోధ చేస్తూ "కాలుజారి క్రిందపడి విరిగినా వైద్యుని సహాయంతో విరిగిన ఎముకలని సరిచేసుకోవచ్చు. కాని మనస్సు జారితే బంధనకి లోనై జన్మకి తీసుకుని వస్తుంది సుమా" అని చెప్పారు. మనస్సు ఎన్నడూ చెడ్డది కాదు అని చెప్పేవారు శ్రీబాబూజీ మహరాజ్. ఉదయం నిదుర లేచింది మొదలు శబ్ద స్పర్శ రూప రస గంధాలకు ప్రభావితమై మనస్సు అటూ యిటూ సంచారం చేసి అలసిపోయి రాత్రి సమయంలో విశ్రమిస్తుంది.

విశ్రమించిన మనస్సు అజ్ఞాన స్థితిలో ఉన్న ఇంద్రియాల ప్రభావానికి లోను కావటం లేదు. అందువలన ప్రశాంతంగా ఉన్న బ్రహ్మ ముహూర్త కాలం ధ్యానానికి అనుకూలమైనదిగా చెప్పబడుతోంది. గడియారం ముల్లు అటూ యిటూ తిరిగినంతసేపూ కాలం తెలుస్తోంది. తీరా ఆ ముల్లు తిరగటం ఆగిపోతే కాలం నిలిచిపోతోంది. అలాగే మనస్సు ప్రపంచ సంచారం చేసినంత సేపూ కాలంలోనే ఉండక తప్పదు. ఆ సంచారం నిలిచిన మరుక్షణం కాలం నిలచిపోతుంది.మనస్సు గమ్యం తెలియక లక్ష్యం లేక పరుగులు పెట్టి ప్రయాసతో ఆయాసపడిపోతోంది. స్వస్థానం చేరితే ప్రయాస ఉండదు. అయితే స్వస్థానమేదో తెలియాలి. శాస్త్ర జ్ఞానం అందుబాటులోనే ఉంది. శాస్త్రంలో అన్ని వివరంగా చెప్పబడ్డాయి.

సముద్రం నిండా నీరు ఉంది. అయినా సముద్రపు నీరు వర్ష మేఘంగా మారి వాన కోసం మనం ఎలా ఎదురు చూస్తామో అలాగే శాస్త్రాలలో వివరించబడిన జ్ఞానాన్ని తెలియ జేయటానికి సద్గురుమూర్తి కావలసినదే. నడవటానికి కాళ్ళు, చూడటానికి కళ్ళు ఉన్నంత మాత్రాన గమ్యస్థానానికి చేరలేము కదా! నడవటానిక కాళ్ళు లేకపోయినా గమ్యము తెలిసిన వ్యక్తి మార్గాన్ని అన్వేషించగల చక్షువులతో మార్గదర్శకుడు అవుతాడుకదా! అలాగే శాస్త్రజ్ఞానానికి సద్గురు మూర్తి మార్గదర్శకత్వం ప్రసాదించేది అనుభవ జ్ఞానము కాక మరేమిటి? అటువంటి అనుభవ జ్ఞానాన్ని సాధించగల సమర్థత మనస్సుకి ప్రసాదించిన భగవానునికి ఇంద్రియాలలో మనస్సు అందువలననే ప్రీతికరమైనది.

*

# అమ్మ ఆశీస్సులు

**గురుబిన్ ఐసోకొన్ కరే సద్గురుబిన్ ఐసోకొన్‌కరే**
**మాలా తిలక్ మనోహర్ బానా లైసిర్ క్షత్ర ధరే**
**భవసాగర్‌మే డూబుత్ రహాకే దీపక్ హాథ్ ధరే**
**సూర్ శ్యామ్ గురు ఐసో సమరథ్ క్షణమే లైఉధరే॥**

సమర్థులైన శ్రీగురుదేవులు మాత్రమే జనన మరణ ప్రవాహమునందు కొట్టు మిట్టాడుతున్న జీవునికి జ్ఞానదీపాన్ని చూపించి క్షణంలో ఒడ్డుకు చేర్చగలిగిన వారుకాక మరెవరున్నారు? గురువు లేకపోతే ఏ శాస్త్రమైనా, ఏ విద్యయైనా గుడ్డిది. అందుకే శ్రీగురుగీతలో....

**అజ్ఞాన తిమిరాన్ధస్య జ్ఞానాంజన శలాకయా**
**చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః ॥**

(గురుగీత)

తన్నాశ్రయించిన సచ్ఛిష్యునికి అజ్ఞానమనే అంధత్వమను పొరను, జ్ఞాన శలాక చేత చికిత్స చేసి, జ్ఞానచక్షువును ప్రసాదించి, చిత్స్వరూపునిగా మార్చి గుర్తింప జేసినవారు శ్రీగురుదేవులు. శ్రీరామకృష్ణ పరమహంస, రమణమహర్షి, ఆదిశంకరాచార్య స్వామి, సమర్థ రామదాస స్వామి, తులసీదాసు, తుకారాం, జ్ఞానదేవుడు, నామదేవుడు, మన సద్గురుదేవులు - ఇటువంటి మహాత్ములు ఎందరెందరో అందరికీ ఆశ్రయమిచ్చి, దివ్య జ్ఞానమును నిత్యమూ ప్రసాదించుచూనే ఉన్నారు.

శ్రీగురుదేవులు మాటిమాటికీ గుర్తు చేస్తూ ఉండేవారు- భగవద్గీతలో ఎన్ని అక్షరములున్నవో అంతమంది మాహాత్ములు మనకు తత్త్వాన్ని బోధిస్తూనే ఉన్నారు. ఆ బోధను అందుకునే పాత్రలు మీరే అయి ఉండాలి అని. మనం ఎంత అదృష్టవంతులం! మనకు సమర్థవంతమైన శ్రీగురుపాదం లభించింది. అణువణువులోనూ, ప్రతి పదములోనూ సర్వజ్ఞులైన శ్రీగురు పదములను సేకరించుకొనటమే మన భాగ్యము. అట్టి శక్తిని, భక్తిని శ్రీగురుదేవులు మనకు ప్రసాదించెదరు గాక!!

మీ అమ్మ
శ్రీసద్గురుదేవుల సేవలో

# బాబూజీ ఉవాచ

- వెంకట రమణ ప్రసాద్

ప్రతి మానవుడూ తన జీవితకాలంలో అనేక సత్యాలను తెలుసు కుంటూ ఉంటాడు. కొన్ని సత్యాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటే, మరికొన్నిటిని అనుమానం వల్ల, ఊహవల్ల తెలుసుకుంటాడు. వార్థక్యం తప్పించుకోరానిదనీ, మృత్యువు అనివార్యమనీ, సంపదలూ సౌఖ్యాలూ చంచలమనీ, లోభం దుఃఖానికి దారి తీస్తుందనీ, శారీరిక సౌందర్యం కన్న సౌశీల్య సౌందర్యం గొప్పదనీ, తృప్తిని మించిన సంపద లేదనీ అందరికీ తెలుసు. కానీ యింత విజ్ఞానం ఉన్నా, ప్రతి మానవుడూ మాయామోహితుడై సుఖాలను వాంఛిస్తూ దుఃఖాల పాలవుతున్నాడు. తన తప్పుకు పరిహారంగా అనంత క్లేశాలకు గురౌతున్నాడు. ఇలా ఎందుకు జరుగుతోంది? ఈ తప్పుడు భావనకు కారణం ఏమిటి?



ప్రతి మానవుడూ ఆనందాన్ని కోరుకుంటాడు. మానవుడు చేసే ప్రతి ప్రయత్నానికీ లక్ష్యం ఆనందమే. కాని ఏవేవి తనకు ఆనందాన్ని కలిగిస్తాయని భావిస్తాడో అవన్నీ తనకు క్లేశాన్ని కలిగించటమే చాల విచిత్రమైన విషయం. తాను పొందిన సుఖం కంటె అవి అంతమయ్యాయన్న దుఃఖమే పెద్దది. అలా కాకపోతే, ఏ యింద్రియ పరితృప్తి కోసం అతడు ఆరాటపడుతున్నాడో ఆ యింద్రియాలు అతనికి శాశ్వతానందాన్ని సమకూర్చాలి. కాని "ఇంద్రియాల వల్ల నేను శాశ్వత సౌఖ్యాన్ని పొందగల"నని సాక్ష్యం యివ్వగలవారెవరూ భూమి మీద కనిపించటం లేదు. ఈ విషయం అందరికీ తెలిసినదే అయినా, ఎవరూ ఇంద్రియ తృప్తికి ప్రయత్నించటం మానుకోనూలేదు. ఎందుకు మానవుడు యీ వ్యర్థ ప్రయత్నంలో జీవితాన్ని వ్యయం చేసుకుంటున్నాడు?

ఈ వ్యర్థ ప్రయత్నం చేయటమే కాకుండా మరొక విషయంలో కూడా మనిషి తనకు తాను అన్యాయం చేసుకుంటున్నాడు. తాను వాస్తవానికి సచ్చిదానంద స్వరూపుడే అయినా, తను శరీరమనే భ్రాంతికి గురౌతున్నాడు. తాను ద్వందాతీతుడే అయినా తనను తాను ద్వంద్వాలకు గురిచేసుకుని

నానా నరక వేదనలను అనుభవిస్తున్నాడు. ఈ అజ్ఞానమే మృత్యువు.

సరస్సులో నీళ్ళను కప్పిన నాచు, సరస్సులో తాను మాత్రమే ఉండి, నీళ్ళు లేనట్లు ఎలా భాసింపజేస్తుందో, అలాగే మానవుణ్ణి క్రమ్మిన మాయ సత్యాన్ని స్ఫురింప నియ్యదు. ఒకవేళ నాచును ప్రక్కకు నెట్టి నీళ్ళను చూచినా మరుక్షణమే మాయ అతణ్ణి మాయలో పడవేస్తుంది.

శ్మశానంలో కాలుతున్న శవాన్ని చూచినవాడు జీవితపు అశాశ్వత తత్త్వాన్ని గుర్తిస్తాడు. "ఏం చేసినా మృత్యువును నుంచి ఎవరూ తప్పించుకోలేరు'' అని తనే అంటాడు.

ప్రసూతివేళ బాలింతరాలు దాంపత్యంలో ఉన్నది సుఖం కాదనీ, సుఖం అనే ముసుగు ధరించిన దుఃఖం మాత్రమేననీ గుర్తిస్తుంది.

పురాణం వింటున్నవాడు కూడ జీవితపు నిస్సారతను ఒక్క క్షణం గుర్తిస్తాడు. అయితే యీ జ్ఞానాన్ని వెంటనే నాచులాంటి మాయ కప్పివెయ్యటంతో తిరిగి కథ మొదలై సుఖాల వేటలూ, వెంపర్లాటలూ మొదలవుతాయి.

కొంతమంది జీవితంలో ఏదో అఘాతం వల్లనో, మహోద్రేకం వల్లనో జీవితం అంటే విరక్తి కలిగి సన్యసిస్తూ ఉంటారు. కుటుంబాన్ని పోషించలేకనో, దారాపుత్రాదులతో రేగిన తగవుల వల్లనో, అప్పులు తీర్చలేకనో కొందరు సన్యాసులుగా మారటం చూస్తూ ఉంటాము. కాని వాళ్ళ సన్యాసం జ్ఞానంలోనో, త్యాగంలోనో ఉద్భవించింది కాదు. అది కేవలం ఉద్రేకంలో పుట్టింది. అయితే ఉద్రేకాలన్నీ క్షణభంగురాలే కనుక, ఉద్రేక కార్యాలన్నీ అర్థరహితమవుతాయి. ఉద్రేకంలో స్వీకరించిన సన్యాసం కాషాయాల వరకు మాత్రమే పరిమిత మవటం మనం తరచూ చూస్తూనే ఉంటాం.

మానవుడు ఎంత అనాదో, అతడి విద్య కూడా అంతే అనాది. ఈ అవిద్యనే అద్వైతులు 'మాయ' అంటారు. 'యా మా, సా మాయ' అంటే 'యేది లేదో అది మాయ' అని అర్థం. మానవుడి అవిద్యకు అతడిని ఆవరించిన మాయయే కారణం.

**ఈశ్వర సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి।**
**భ్రామయన్సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥**

(భ.గీ 18-61)

అంటాడు శ్రీకృష్ణుడు. మాయను తరించటం దుస్సాధ్యమనీ, అయితే ఎవరు తనను శరణు వేడతారో వారు మాయను తరించగలరనీ అంటాడు.

**దైవీ హ్యేషాగుణమయీ మమ మాయా దురత్యయా।**
**మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతితే ॥**

ఎంత పండితుడైనా, ఎంత సమర్థుడైనా భగవంతుడికి శరణాగతుడైతేగాని మాయను జయించలేడు. దేవర్షియైన నారదుడంత వాడికి మాయను జయించటం సాధ్యపడలేదంటే యిక సామాన్యుల విషయంలో చెప్పవలసిన దేమున్నది? మాయ మానవుని ఇంద్రియాలనే తన సేనాధిపతులుగా చేసుకుని, అతడి ధైర్యమనే కోటను ఛేదిస్తుంది. పంచేంద్రియాలూ మాయకు వశులై లోపలనుంచీ, బయటనుంచీ మానవుణ్ణి ఒకేసారి ముట్టడించి లోబరచు కుంటాయి. ఈ సందర్భంలో జైమిని మహర్షి కథ మనకెంతో కనువిప్పు కలిగిస్తుంది.

తాను ఏది వ్రాసినా జగత్కళ్యాణాన్ని ఉద్దేశించి వ్రాసిన వ్యాసమహర్షి ఒకనాడు మానవుడిపైన యింద్రియాల ప్రభావమూ, వాటి శక్తీ మొదలైన అంశాలను గురించి వ్రాస్తున్నాడు. ఆయన శ్లోకంలో సగం....

**'బలవానింద్రియగ్రామో విద్వాంస మపికర్షతి'**

అని వ్రాసి, యేదో పనిమీద బయటకు వెళ్ళాడు. (ఇంద్రియ గ్రామో - ఇంద్రియ సమూహము, బలవాన్ - శక్తివంతమైనది. విద్వాంసమపి - విద్వాంసుని కూడ, కర్షతి - దిగలాగ గలవు)

ఇంతలో శ్రీవ్యాస శిష్యుడైన జైమిని ముని గురుదర్శనార్థమై వచ్చి, గురువు అక్కడ లేకపోవటంతో కాలక్షేపం కోసం, వ్రాసి ఉన్న తాళపత్రం తీసుకుని చదివి ఆశ్చర్యపడ్డాడు. ఇదేమిటి! గురుదేవులు యిలా వ్రాశారు? ఇంద్రియాలు విద్వాంసుణ్ణి జయించగలవా? ఇది అసందర్భం గదా! ఇంద్రియాల ప్రభావం పామరులపై ఉంటే ఉండవచ్చుగానీ, నాబోటి విద్వాంసుణ్ణి అవి ఏమిచేయగలవు? గురుదేవులు ఏదో తొందరలో పొరబాటుగా వ్రాసినట్లున్నారు. ఈ పాదాన్ని సరిచేస్తే మంచిది. అది ఎప్పుడో కాదు. ఇప్పుడే చేస్తాను'' అని భావించి వెంటనే ఆ శ్లోక పాదాన్ని **"బలవానింద్రియగామో విద్వాంసంనాపి కర్షతి''** అని మార్చి సరిదిద్ది వ్రాశాడు. (ఇంద్రియాలు బలమైనవే గాని, అవి విద్వాంసుణ్ణి ఏమీ చేయలేవు) అని మార్చిన శ్లోకభాగానికర్థం. అలా మార్పుచేసి తన పనిమీద తాను వెళ్ళిపోయాడు జైమిని.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

మనం చూస్తున్న ఈ ప్రపంచం కేవలం మన మనస్సనే అద్దంలో ప్రతిబింబించేదే. అదే, 'యధా దృష్టి - తథా సృష్టి' అన్నారు. మనం ఏవిధంగా చూస్తే మనకి ప్రపంచం ఆ విధంగానే కనిపిస్తుంది. అంతా మనలోనే వుంది. మనలో ఒక దివ్యశక్తి వున్నది. ఆ దివ్యశక్తి వల్లనే మన కళ్ళు చూడగలుగుతున్నాయి. చెవులు వినగలుగుతున్నాయి, మిగతా ఇంద్రియాలన్నీ వాటి వాటి పనులను చేయగలుగుతున్నాయి.



భగవంతుని యొక్క సర్వవ్యాపకత్వం ఎవరికి వారే స్వయంగా, అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. పంచదార యొక్క మధురత్వాన్ని ఏవిధంగా అయితే మనం వివరించలేమో, భగవంతుడు, లేక గురుదేవుని యొక్క దివ్యానుభూతిని కూడా మాటలలో వర్ణించలేము. అది కేవలం అనుభవైకవేద్యం. అంతటా నిండివున్న భగవంతుడిని తెలుసుకోవాలంటే మానవుడు మొట్టమొదట తనలో వున్న భగవంతుడిని చూడటం నేర్చుకోవాలి. తమ యొక్క దివ్యబోధన ద్వారా, ఆధ్యాత్మిక శిక్షణ ద్వారా, సద్గురుదేవులు దివ్య జ్ఞానాన్ని ప్రసాదించి, సరయిన టైములో (కాలం పరిపక్వం చెందేసరికి) శిష్యుడికి సత్యదృష్టిని ప్రసాదించి భగవంతుని దివ్య దర్శనం చేయిస్తారు.

సంత్ తులసీదాసు కథలో యీ విషయం గురించి మనకి ఎంతో చక్కగా చెప్పబడింది. తులసీదాసు గొప్ప రామ భక్తుడు. ఆయన నిరంతరం రాముని దర్శనం కోసం తపిస్తూ వుంటాడు. అటువంటి తపనతో, రామభక్తాగ్రేసరుడైన మారుతిని తనకి రామదర్శనం చేయించమని వేడుకొంటాడు. ఆంజనేయస్వామి తులసీదాసుని ఆ కోరికను విరమించుకొమ్మని ఎన్నో విధాల చెప్పి చూస్తాడు. కానీ ఎంత చెప్పినా తన పట్టు విడవని తులసీదాసు గురించి శ్రీరామ ప్రభువుతో చెప్పడానికి ఎట్టకేలకు మారుతి అంగీకరించి, రాముడితో తులసీదాసు యొక్క రామదర్శన కాంక్ష

గురించి చెప్పి, రాముడిని అతడికి దర్శన మీయమని కోరుతాడు. అది విన్న రామచంద్రుడు, కాలం యింకా పక్వానికి రాలేదు. సరైన టైములో తాను తులసీదాసుకి దర్శనం యిస్తానని చెప్తాడు. అయినా కూడా మారుతి అనేక విధాలుగా చెప్పి, చివరకి ఎలాగో రాముడిని తులసీదాసుకి దర్శన మిచ్చేలాగ ఒప్పిస్తాడు.

తనకు భగవంతుడు దర్శన మీయడానికి ఒప్పుకున్నాడని విన్న తులసీదాసు, ఆనందాంబుధిలో ఓలలాడుతూ, భక్తులకీ, సాధువులకీ, అందరికీ ఒక గొప్ప సమారాధన ఏర్పాటు చేస్తాడు. ఆయన తన రాముడి కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తూ వుంటాడు! ఇంతలో ఆ భక్తులందరూ చక్కగా భోజనాలు ఆరగిస్తూ వుండగా, ఎక్కడి నుండో బురదతో కప్పబడిన ఒక పంది వచ్చి, ఆ భక్తుల పంక్తుల మధ్యన పరుగులు పెడుతూ, దాని ఒంటి నున్న బురదను అంతటా వెదజల్లుతూ, విస్తళ్ళన్నీ తొక్కి భీభత్సం సృష్టిస్తుంది. అక్కడ ఆశీనులైవున్న సాధుమహాత్ములు, భక్తులు, తులసీదాసుతో సహా అందరూ, ఆ పందిలో వున్న భగవంతుడిని గుర్తించక, దానిని కొట్టి తరిమివేస్తారు. తులసీదాసు రాముడికోసం ఎదురుచూస్తూనే వున్నాడు! ఎప్పటికీ రాముడు కనిపించకపోయే సరికి నిరాశకు లోనవుతాడు. రెండవసారి, భగవంతుడు ఒకరాజు వేషంలో గుర్రాన్నెక్కి అటుగా వెళ్తూ తులసీదాసుకి దర్శనమిస్తాడు. అప్పుడు కూడా తులసీదాసు రాముడిని గుర్తించడు.

మరుసటిరోజు తులసీదాసు, తనకి దర్శనం యిస్తానని చెప్పి, రాముడు దర్శనం ఎందుకీయలేదని హనుమని ప్రశ్నిస్తాడు. అప్పుడు హనుమ, ఆ పంది రూపంలోనూ, రాజు రూపంలోనూ వచ్చినది రామచంద్రుడే కానీ, వేరెవరూ కాదు అని చెప్తాడు. చూశారా! రాముడంటే ధనుర్బాణాలు, కిరీటము ధరించి, దివ్య వలువలు దాల్చి వస్తాడనుకున్నాడు తులసీదాసు! భగవంతుడైన రాముడు ఆ ఒక్క రూపానికే పరిమితుడు కాదుకదా!

తులసీదాసు నిస్సంశయంగా గొప్ప భక్తుడే. కానీ భగవంతుని యొక్క సర్వవ్యాపకత్వాన్ని, సర్వశక్తిమంతత్వాన్ని, గ్రహించే స్థితి అప్పటికింకా రాలేదు ఆయనకి. మనసు పరిపక్వత చెందితేనే కదా అన్ని రూపాలలోనూ, అంతటా వున్న రాముని గుర్తించగలిగేది! అందుకనే మారుతి చెప్పినా కూడా తులసీదాసుకి దర్శనం ఇవ్వడానికి సందేహించాడు రాముడు. తన భక్తులకి

ఏటైములో ఏది ఇవ్వాలో ఆ భగవంతుడికి తెలుసు.

అదేవిధంగా గురుదేవుడు కూడా ఒక రూపానికి, ఒక శరీరానికి పరిమితులు కారు. ఆయనసర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు అయిన పరబ్రహ్మమే అని చెప్తూ, శ్రీమాతాజీ మానవుడు మనస్సు నుండి ఆత్మేతర భావనలను, విషయ వాసనలను, కామక్రోధాది గుణములను పారద్రోలి, మనస్సును శుద్ధంగా వుంచుకోవాలని పదేపదే నొక్కి వక్కాణించారు. కేవలం నిరంతర భగవన్నామ స్మరణ వల్లనే అది సాధ్యమని చెపుతూ, శ్రీమాతాజీ తమ సుమధురగళముతో నామసంకీర్తన చేసి, అందరిచేతా సంకీర్తన చేయించారు. ఆ తరువాత అధ్యాత్మ సాధకుడికి సత్యగురువుయొక్క ఆవశ్యకత ఎంతైనా వున్నదని, అటువంటి సత్యగురువునాశ్రయించి, వారు చెప్పిన బాటలో సాధన కొనసాగించి, శాశ్వత సుఖశాంతులకి వారసులు కండి అని శ్రీమాతాజీ పునరుద్ఘాటించారు. "అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, సుఖశాంతులను ప్రసాదించి సర్వులనూ గురుపాదుకలు కాపాడుగాక!" అని శ్రీమాతాజీ తమ దివ్యాశీస్సులను సర్వులపై వర్షించారు.

హరిః ఓం తత్సత్

---

సజ్జనుడొకడు దారిలో నడుస్తుండగా అకారణంగా వానిని ద్వేషించే దుర్జనుడొకడు ఎదురై కసితీరా ఆ సాధువును కొట్టి వెళ్ళిపోయాడు.

గాయాలతో పడున్న వానిని ఒక మంచివాడు చూసి జాలిపడి, చికిత్స చేసి అతడు కాస్తంత తేరుకొన్నాక "అయ్యా! మిమ్మల్ని ఇలాగ బాధించినదెవరు?" అని అడిగాడు.

సమదర్శనుడైన ఆ సజ్జనుడు "ఎవరు నన్ను గాయపరిచారో, వారే నాకు దయతో చికిత్స చేశారు" అన్నాడు.

సాధువులు ప్రేమించేవారిని, ద్వేషించేవారిని సమానంగానే చూస్తారు.

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

30-5-1985

ఈ రోజు రాత్రి రావుగారు శ్రీబాబుని ప్రశ్నిస్తూ శ్రీరామచంద్రునికి వశిష్ఠులవారు, విశ్వామిత్రులలో ఎవరిని గురువుగా పరిగణించవచ్చును? అని అడిగారు. శ్రీబాబు సమాధానం చెబుతూ శ్రీరామచంద్రుడిని ఎలా భావిస్తున్నారు? మానవుడిగా భావిస్తున్నారా? లేక అవతార పురుషుడిగా భావిస్తున్నారా? అని అడిగారు. మానవదేహం దాల్చినప్పుడు మరి అంతే కదండీ అన్నారు రావుగారు.

శ్రీబాబు మాట్లాడుతూ మీరు శ్రీరామచంద్రుడిని మానవుడిగా భావిస్తున్నట్లే కదా! అయితే కృష్ణపరమాత్మని, గోపికలను చూసి మీ కవులు ఏమని వర్ణిస్తారు? భౌతిక దృష్టితో చూస్తారా? అంటే కృష్ణపరమాత్మ 16వేల మంది గోపికలతో క్రీడించినట్లేగా? మీ కవులు వ్రాసేదానికి, ఆచరించేదానికి సంబంధం ఉంటే కదా! రత్నం బొగ్గునుంచే ఉద్భవించింది. కాని దాని ప్రకాశానికి ఏం లోటు వచ్చింది? అలాగని ఆ రత్నాన్ని ఆ బొగ్గులోనే ఉంచితే దాని విలువ ఏం తెలుస్తుంది?

వశిష్ఠులవారు శ్రీరామచంద్రుని దర్శనార్థం 10వేల సంవత్సరాలు వేచిఉన్న సంగతి మీకు తెలిసినదే కదా! శ్రీరామచంద్రుడు దశరథ తనయుడిగా రానున్నాడని వశిష్ఠులవారికి ముందుగానే తెలుసు. శ్రీరామచంద్రుడు, కృష్ణపరమాత్ముడు అవతారపురుషులైనప్పటికీ గురువును ఆశ్రయించనిదే దేనినీ సాధించలేరనే విషయం సామాన్య మానవులకి తెలియ జేయటానికే అన్నట్లు వారు కూడా గురుశుశ్రూష చేశారు. అవతార పురుషులు వారు దేనికైనా సమర్థులే. అంతదాకా ఎందుకు? శ్రీకృష్ణ పరమాత్మ గురువు సాందీపుడు తన పుత్రునికోసం మరి ఎవరిని ఆశ్రయించాడు? కృష్ణపరమాత్ముడు జగద్గురువు అని నిరూపించడానికే అన్నట్లుగా ఉంది. ఆయనకి తప్ప అన్యులకి సాధ్యపడుతుందా అన్నారు శ్రీబాబు.

రావుగారు ప్రశ్నిస్తూ మానవుడు పరమాత్ముని దర్శించాలంటే గురువుని ఆశ్రయించాలాండీ! అలా అయితే మరి రమణ మహర్షికి గురువు ఉన్నట్లుగా ఎక్కడా ఆధారాలు లేవుకదండీ అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ శ్రీరమణ మహర్షి కారణజన్ముడు. అటువంటివారు అనేకమంది ఉన్నారు. మహాత్ములు అనేక రకాలుగా ఉన్నారు. కొంతమంది గృహస్థాశ్రమాన్ని స్వీకరించారు. వారు రాజర్షులుగా ప్రకాశించారు. మరి కొంతమంది బ్రహ్మచర్యాన్ని ఆచరించారు. ఇందులో ఎవరు గొప్పని చెప్పగలరు? మహాత్ములు చెప్పినదానిని మనం ఆచరించాలి గాని వారు చేసినట్లు మనం చేయగలమా? పికిలిపిట్ట నెమలిపిట్ట అంత గుడ్డు పెట్టగలుగుతుందా?

మీ కవులు గురువుని సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపునిగా వర్ణించారుగా? మరి ఆయనకి ఎంత విలువ ఇవ్వాలి? గురుతత్త్వాన్ని ఎవరు అర్థం చేసుకుంటారో వారు పరమ పథాన్ని చేరుకుంటారు. భగవంతుణ్ణి దూషించినా ఆ దుష్కర్మ నుండి గురుదేవుడు నిన్ను రక్షించగలుగుతాడు. కాని గురుదేవుని దూషించినా, తిరస్కార భావంతో చూసినా, గురువాజ్ఞా పాలన చేయకపోయినా కల్పాంతం వరకు విముక్తి ఉండదు.

గురుతత్త్వాన్ని గురించి నువ్వు ఏమి తెలిసికోగలుగుతావు? అజ్ఞాని చూసేదేమిటి? బాహ్య ఆడంబరాలే కదా! గురుమూర్తి భోజనం చేస్తే అదొక వింత కొంతమందికి! ఆయన భోజనం చేస్తారా? అని ప్రశ్నిస్తారు. మరి ఆయన భోజనం చేయకూడదా? డ్రస్ వేసుకోకూడదా? పోనీ డ్రస్ లేకుండా దిగంబరిగా ఉంటే ఊరుకుంటారా?

నేను ఎప్పుడూ ఆ భగవంతుడి దృష్టిలో పడాలని కోరుకునేవాడిని. ప్రజల దృష్టిలో పడితే ఏం లాభం? ఆహా! ఓహో! ద్వారా వచ్చేది కీర్తి వ్యామోహమే కదా! భగవంతుని ద్వారా లభించే కీర్తి శాశ్వతమైనది. నేను ఎవ్వరికైనా ఏదైనా ఉపకారం చేస్తే అది నా ప్రజ్ఞ అనుకొనే వాడినికాదు. నేను భగవంతుడి సేవకునిగా భావించేవాడిని. నేను ఎప్పటికీ ఒక్కటే కోరుకుంటాను. నాలోని ప్రజ్ఞ ఎవరికీ కనబడకూడదు. ఇతరులలోని నీచగుణాలు నాకు కనబడకూడదు. సత్యగురువు ఎన్నడూ ధనానికిగాని, పదవికిగాని, పొగడ్తలకి గాని లొంగడు.

నా చిన్నతనంలో జరిగిన ఒక సంఘటన చెబుతాను. నేను గుంటూరులో ఉండగా పూర్ణానందభారతి అనే స్వామి వచ్చారు. ఆయన దగ్గర ఉపదేశం పొందాలని వెళ్ళాడు ఒక భక్తుడు. తీరా ఆయని ఉపదేశం చేయమని అడిగేలోపు వీరి తాలుకు పిల్లవాడు స్వామివారిని తాకినందుకుగాను దోషపరిహారం క్రింద కొంతపైకం చెల్లించవలసి వచ్చింది. మరి అటువంటి

వారిని ఆశ్రయిస్తే ఏమవుతుంది? ఒక గుడ్డివాడిని ఇంకో గుడ్డివాడు ఆశ్రయించాడుట. ఇద్దరూ కలిసి గోతిలో పడ్డారు. ఆ ఇరువురిలో ఎవరు ఎవరిని రక్షించగల్గుతారు? ఇద్దరూ అంధులే కదా!

నా చిన్నతనంలో జరిగిన సంఘటన చెబుతాను. గోదావరి గట్టున చెట్టుపైన రెండు కామినీ పిశాచాలు ఉండేవి. అందులో ఒకటి బ్రహ్మ పిశాచము. పిశాచ జన్మ దుష్కృత కర్మ వలన వస్తుంది. ఆ పిశాచాలు చాలా పీడించాయి. ఎంతోమంది భూతవైద్యులు ప్రయత్నించి, ఫలితం లేక వెళ్ళిపోయారు. వారికి నేను సాంబ్రాణి ఇచ్చి ధూపం వేయమని చెప్పాను. వారు అలానే చేసేసరికి ఆ బ్రహ్మ పిశాచి మాట్లాడుతూ మీకు సాంబ్రాణి ఇచ్చిన మహాత్ముని పాదతీర్థం నామీద చల్లండి. దానికోసమే పరితపిస్తున్నాను అని పలికింది. వారు నా అజ్ఞమేరకు ఆ పాదతీర్థాన్ని చల్లగానే ఆ పిశాచాలు తరించాయి అన్నారు శ్రీబాబు.

-సశేషం

ఒక చిలుక ఎగిరి వచ్చి ఒక బూరుగు చెట్టు ఉన్న కొమ్మమీద వ్రాలింది. అక్కడ దానికి ఒక కాయ కనిపించింది. అది పండుతుందని, తన కడుపు నిండుతుందని ఆశతో ఎదురు చూస్తూ కూర్చుంది. దాని సమయానికది పట్టున పగిలి అందులో నుంచి దూది బైటకి వచ్చి గాలికి ఎగిరిపోగా చూసిన చిలుక ఆశ నిరాశ అయింది.

సంసారిక వృక్షానికి లౌకిక సుఖాలనే కాయలు కాసి, అవి అనుభవించే జీవుడనే చిలుక అందులోని సారం మధురమని భ్రమ చెందుతుంది. తీరా అవి అన్నీ అశాశ్వతమై నశించిన వెనుక జీవునికి దుఃఖమే మిగులుతుంది.

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

ఆగస్టు 2011

12 శుక్ర వరలక్ష్మీ వ్రతం.

13 శని రాఖీపూర్ణిమ, రక్షా బంధనం, శ్రీ సద్గురుపాదపూజ

21 ఆదివారం నుండి 23 మంగళవారం వరకు శ్రీ కృష్ణాష్టమి పూజలు

21 ఆది ఉదయం 10 గం.లకు కలశస్థాపన, శ్రీ రాధాకృష్ణ అర్చన, భక్త సమారాధన. రాత్రి 8గం.లకు శ్రీసద్గురు పాద పూజ.

22 సోమ ఉదయం 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ,11 గం.లకు శ్రీ రాధాకృష్ణ సామూహిక పూజలు, భక్త సమారాధన.

23 మంగళ ఉదయం 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన. రాత్రి 8 గం.లకు ఉట్టి కొట్టుట

24 బుధ శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

27 శని శనిత్రయోదశి , మాస శివరాత్రి

సెప్టెంబరు 2011

1 గురు శ్రీవినాయక చవితి, ఉదయం 5గం.30నిలకు శ్రీ సద్గురు పాదపూజ. ఉదయం11 గం.లకుశ్రీవిఘ్నేశ్వరస్వామి సామూహిక పూజలు. భక్త సమారాధన.

5 సోమ టీచర్స్ డే, ఆచార్య దినోత్సవము, ఉదయం 10 గం. శ్రీ సద్గురు పాదపూజ

10 శని శనిత్రయోదశి.

12 సోమ పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ.

22 గురు శ్రీగురుదశమి, సత్సంగసమావేశము, శ్రీసద్గురుపాదపూజ..

26 సోమ మాసశివరాత్రి.

28 బుధవారము నుండి, అక్టోబర్ 8 శనివారం వరకు శ్రీదేవీనవరాత్రి మహోత్సవములు.

28 బుధ ఉదయం శ్రీమాతాజీవారి శ్రీదేవీ శరన్నవరాత్రి పూజా దీక్షా స్వీకారము ప్రతిరోజు ఉదయం 8 గం.లకు శ్రీ రామతారక పరబ్రహ్మ ప్రసాద్, మరియు శ్రీవెంకటరమణ ప్రసాద్ గార్లచే శ్రీదేవీ భాగవత ప్రవచనము. మధ్యాహ్నము జగన్మాత కుంకుమార్చనలు, హారతి, మంత్రపుష్పము, దర్బారు, భక్త సమారాధన.

29 గురువారమునుండి 6గురువారము వరకు వరకు ఆధ్యాత్మిక ప్రవచనములు, శ్రీమాతాజీవారి అనుగ్రహభాషణము, మరియు ఆశ్రమ భక్తుల ఆధ్యాత్మిక ప్రసంగములు,శ్రీ గురుదేవుల దివ్యదర్శనము, బోధ (వీడియో), శ్రీ బాబూజీ మహరాజ్ వాడిన వస్తువులమ్యూజియమ్ ప్రదర్శన

**అక్టోబర్ 2011**

3 సోమవారం శ్రీ సరస్వతీపూజ, మూలా నక్షత్రం,

4 మంగళవారం దుర్గాష్టమి. ఉదయం శ్రీ జగన్మాత సామూహికపూజలు,

5 బుధ మహర్నవమి.

6 గురు విజయదశమి, ఉదయం శ్రీ జగన్మాత సామూహికపూజలు, నామకరణములు, అన్నప్రాశనలు, అక్షరాభ్యాసములు రామాలయంలో జరుగుతాయి.

7 శుక్రవారం ఏకాదశి, ఏకాహం.

8 శనివారం దీక్షావిరమణ, పూజాక్షతలు శ్రీమాతాజీ భక్తులపైన చల్లుతారు, రాత్రి 7 గం.లకు జగన్మాత ఊరేగింపు. రాత్రి 8 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ.

ఒకచోట ఒక స్వామివారు ప్రవచనం చేస్తున్నారు. అప్పుడే అక్కడకు వచ్చిన ఒక ఉద్యోగి “పనీ పాట లేని యీ మాటల వల్ల ఎవరికి ఉపయోగం?” అని యెత్తిపొడిచాడు.

“ఛ! అవతలకు పో! మూర్ఖుడా!” అన్నారు స్వామీజీ. ఉద్యోగి ఉగ్రుడై తిట్టటం మొదలు పెట్టాడు.

“అయ్యా! ఉద్యోగిగారూ! క్షమించండి. మిమ్మల్ని నిందించటం నా ఉద్దేశ్యం కాదు. నేను ‘మూర్ఖుడా!’ అన్న ఒక్క మాటకే మీకు యింత కోపం వచ్చిందే, యిన్ని రోజులుగా నేను చేస్తున్న బోధకు శ్రోతలకు జ్ఞానం రాదా?” అన్నారు స్వామీజీ.

తలవంచటం ఉద్యోగి పనైంది.

# శ్రీగురు దక్షిణ

(గతసంచిక తరువాయి)

- సుశీలా ప్రసాద

ఇప్పుడు వాడు చేతిలో చిల్లిగవ్వ కూడా లేకుండా, కారాగారం నుంచి బయటకు వచ్చాడు. తన స్థితిని తలుచుకుని తన నికృష్టపు బ్రతుకుమీద రోత కలిగింది శివుడికి. ఎప్పటిలాగా మళ్ళీ ఆ కుళ్ళులోకి అడుగు పెట్టడానికి మనస్సు రాక, కాసేపు ఆలోచిస్తూ కూర్చుండి పోయాడు. ఈ వాతావరణానికి దూరంగాపోయి, సరైన దారిలో బ్రతకాలనిపించింది. అలాగైతే ఈ పరిసరాలకి దూరంగా వెళ్ళిపోవాలి. ఇన్నేళ్ళవాడి బ్రతుకులో యిటువంటి మంచి ఆలోచన ఇప్పుడే వచ్చింది. కాళ్ళు నడక సాగించాయి. దూరం దూరం, చాలా దూరంగా, తనని దొంగగా గుర్తుపట్టలేని చోటుకి చాల దూరంగా పారిపోతూ....

అక్కడ ఆగాడు. చీకటి పడిపోయింది. కడుపు కాలుతోంది. కాళ్ళు పీకేస్తున్నాయి. అడుగెయ్యలేనంత నీరసంగా ఉంది. ఒళ్ళంతా పచ్చిపుండులాగ ఉంది. ఎదుట కొండ నల్లగా నిలబడి ఉంది. ఆ ప్రక్కన అక్కక్కడా దీపాలు వెలుగుతూ ఊరేదో కనిపిస్తోంది. కొండనానుకుని గుడిలాగ ఉంది. చుట్టూ నిర్మానుష్యంగా ఉంది. తలదాచుకోవటానికి యీరోజు యీ గుడి చాలనుకున్నాడు శివుడు. గుడి తలుపులు తీసే ఉన్నాయి. నడుం వాల్చుకోవటానికి అక్కడొక చిన్న మండపం ఉంది. లోనికి తొంగి చూశాడు. ఏదో విగ్రహం కనిపించింది.

ఈ దేవుడెవరో తనలాగే ఎవరూ లేనివాడు కాబోలనుకున్నాడు. అప్పుడు వాడి చూపుకి దేవుడి ముందు వెలుగుతున్న దీపాలు కనిపించాయి. వాడి కళ్ళు మెరిశాయి. మిలమిల మెరుస్తున్న రెండు వెండి దీపాలు! విగ్రహం ముందు గ్లాసులో పాలు, పళ్ళెంలో పళ్ళు ఉన్నాయి. ఆకలి దహించివేస్తోంది. శివుడు ఒక్క ఉదుటన ముందుకెళ్ళి గ్లాసందుకుని పాలు త్రాగేశాడు. నీరసం కాస్త తగ్గేసరికి మళ్ళీ వాడి మనస్సులో చెడుబుద్ధి తన్నుకుంటూ పైకి రాసాగింది. ఎవరూ లేరు. దేవుడు మాట్లాడడు. ఎదుట మెరిసే వెండి దీపాలు తన ఆకలి తీర్చడానికి, రెండు రోజులు గడవటానికి పనికివస్తాయి. అయితే దీపాలు వెలుగుతున్నాయి. వాటిని ఆర్పేసి చీకటిలో అవి తీసుకుని ఉడాయించాలని అనుకున్నాడు. నెమ్మదిగా నోటిగాలితో దీపాలను ఆర్పటానికి ముందుకి

వంగాడు. మెత్తగా భుజం మీద బరువేదో పడింది. ఆ క్షణంలో ఉలిక్కి పడ్డాడు. వెనక్కి తిరిగి చూశాడు!

“నాయనా తప్పురా! గుళ్ళో దీపాలు ఆర్పడం మహాపాపం!'' వెనుక నిలబడిన వ్యక్తి అంటున్నాడు. శివుడికి ఒళ్ళు మండింది. “నీతిగా బ్రతకాలనుకునే వాడికి ఆ తప్పులు ఒప్పులు. నీతి నిజాయితి లేని, ఆకలిదప్పులతో అలమటించే దౌర్భాగ్యుడిని నాకే తప్పులు లేవు. తప్పుకో ముందు!'' అన్నాడు కఠినంగా శివుడు.

“నీకే కాదు, అందరి ఆకలి దప్పులు తీర్చేవాడి ముందు నిలబడి నువ్వు నీ బాధను వెళ్ళబోసుకున్నావు కదా! ఇకవాడు నిన్ను చూసి, నీ బాధ విని నిన్ను చూడకుండా వదిలేస్తాడా పిచ్చివాడా!'' అన్న ఆయన మాటలు వింటూ శివుడికి కోపం వచ్చింది.

“ఆహా! ఇన్నాళ్ళూ యేమయ్యాడు వాడు? బండలైన నా బ్రతుకుని ఇప్పుడిక బాగు చేస్తాడా? అంతా అబద్ధం! రాయైనవాడో వెర్రివాడు. నువ్వో వెర్రివాడివి. నేను నమ్మను'' అన్నాడు.

రామశర్మకి నవ్వు వచ్చింది వాడి మాటలకి. “అన్ని పిచ్చులు, వెర్రులు వదిలించేవాడు. వాడు ఏనాడూ వాడిని తలచక, ఇనాళ్ళబట్టీ నువ్వు అనుభవించే కర్మంతా పూర్తి అయింది కనుకనే నువ్విక్కడకి రాగలిగావు యీనాటికి. తిన్నగా చూడు! వాడి చేతికి కంకణం ఉంది. మనందరినీ మంచి మార్గాన నడిపించి, సుఖశాంతులిచ్చేందుకే అది కట్టుకున్నాడు. వాడు సామాన్యుడు కాడు. వాడు తల్చుకుంటే ఎంతపనైనా చేస్తాడు.

రామశర్మ మొహంలో ఏదో కాంతి, ప్రశాంతి వైమరచి చెబుతున్నట్లుగా ఉన్నాయా మాటలు. ఆయన వంక చూసిన శివుడికి అవి స్పష్టంగా కనిపించాయి. “నాపేరు రామశర్మ. నువ్వన్నట్లు దేవుణ్ణి విపరీతంగా విశ్వసించే వెర్రివాణ్ణే నేను. దిక్కు మొక్కు లేక దీనదశలో ఉన్న నా జీవితాన్ని ఉద్ధరించిన వాడు గనుకనే అంత పూర్తిగా నమ్ముతున్నాను. అనుభవంగా నీకూ చెబుతున్నాను. ఇదివరకు నేను ఉన్న చోట నాకు పోటీదారులెక్కువై నన్ను బ్రతకనివ్వకపోతే తరిమివేస్తే యిక్కడకి వచ్చిపడ్డాను. ఆ పడటం వీడి పాదాల ముందు పడ్డాను. ఇప్పుడా! నా అంత భాగ్యశాలి ఎవరూ లేరంటాను'' అన్నాడు.

-సశేషం

# గురు కృపాహి కేవలమ్

-రమణ ప్రసాద్

ఆయనను మా తాతయ్యగారు శ్రీ హనుమత్‌కాళీవర ప్రసాద్‌బాబు అని పిలుచుకునేవారు. వారి అర్చామూర్తులు హనుమంతుడు, కాళీమాత. వారి వర ప్రసాదుడే శ్రీబాబు అనేవారు. అందువల్ల శ్రీబాబును అందరూ ఆ పేరుతో పిలిచేవారు.

భీమవరంనుంచి యనమదుర్రుకి నాలుగు మైళ్ళు. కాలవగట్టు మీదనుంచి నడిచి రావాలి. రెండువైపులా కాలవలు ఉన్నాయి. పడవలమీద కూడ రావచ్చు. వాన పడితే బురద వల్ల రోడ్డుమీద నడవటం చాలా కష్టం. ఏ అర్థరాత్రో వచ్చేవారు శ్రీబాబు. మేము ఉండేది పెంకుటిల్లు. కాని మా తాతయ్యగారు కొంచెం దూరంలో ఉన్న పాకలో ఉండేవారు. దాన్ని గంగరాజుపాక అని పిలుస్తారు. ఊరిలోకి రావటానికి పంటకాలవ బ్రిడ్జిదాటి రావాలి.

శ్రీబాబు బ్రిడ్జిమీదకు రాగానే బ్యాటరీ లైట్ వేసేవారు. ఆ లైట్ చూడగానే శ్రీబాబు వస్తున్నట్లు మా తాతయ్య గ్రహించేవారు తన ఆరాధ్య దైవమైన బాలరాముడే శ్రీబాబు అనేవారు. శ్రీబాబు ఎంత హఠాత్తుగా వచ్చేవారో, అంత హఠాత్తుగా వెళ్ళేవారు.

శ్రీబాబు యనమదుర్రు మొదటసారి మా తాతయ్యగారిని కలిసినప్పుడు మేము మద్రాసులో ఉండేవాళ్ళం. నేను అక్కడే పుట్టాను. శ్రీబాబు మా తాతయ్యగారి ఇంట్లో నా ఫోటో చూసి " ఇతడు విద్యాభ్యాసం చేసేటప్పుడు చాలా అస్వస్థతకులోనవుతాడు"అని చెప్పారట. నేను భీమవరంలో హైస్కూలులో చేరినప్పుడు నాకు డబల్‌టైఫాయిడ్ విథ్ న్యుమోనియా వచ్చింది. చాలా రోజులు స్పృహలేకుండా మంచంమీద ఉన్నాను. డాక్టర్ అమ్మిరాజుగారు నాకు వైద్యం చేశారు. శ్రీబాబు కృపతో రోగముక్తుడనైనాను. చదువు చాలా దెబ్బ తింది. కాని వారి కృపచే చదువు కుంటు పడలేదు. నేను ఆ క్లాసులో ప్యాస్ అయి పై క్లాసులో చేరాను.

శ్రీబాబును ఆ ఊరివారు సిద్ధాంతిగారు అని కూడా పిలిచేవారు. బాబుగారు వచ్చారని తెలియగానే ఆ ఊరివారందరూ తెల్లవారేసరికి మా ఇంటికి వచ్చేవారు. శ్రీబాబు వారి బాధలను తెలిసికొని వాటి నివారణ మార్గాలు తెలిపేవారు. రోగాలతో బాధపడేవారికి మందులు తీచ్చేవారు. సమస్యలతో

వచ్చినవారికి వాటి పరిష్కారం తెలిపేవారు. వారు చెప్పింది చేస్తే వారి రోగాలు మాయమైయ్యేవి. వారి బాధలు తీరేవి. అలా భక్తుల ఆర్తి తీరుస్తూ కాలాన్నే మరచేవారు. "బాబూ! స్నానానికి లేవండి" అని మా అమ్మమ్మ రెండు, మూడుసార్లు జ్ఞాపకం చేసినా ఏ సాయంత్రానికో స్నానం చేసి అనుష్టానం చేసికొనేవారు.

శ్రీ బాబు ఒకసారి వచ్చి వెళ్తే మళ్ళా ఏ రెండు మూడు నెలలకో వచ్చేవారు. శ్రీబాబుభవరోగభిషగ్వరులు. వైద్యశాస్త్రానికి కూడా అంతుపట్టని రోగాలను నయం చేసేవారు. ఇది తెలియజేసే ఉదంతం ఒకటి ప్రస్తావిస్తాను. మా ఊరిలో గున్నప్పగారు అనే పేద బ్రాహ్మణుడు ఉండేవారు. ఆయన పౌరోహిత్యం చేసి అతికష్టం మీద సంసారాన్ని పోషించేవాడు. ఆయన భార్యకు చీలమండలి మీద రణం లేచి చేలా బాధ పడుతోంది. ఎవరు ఏది చెపితే ఆ మందులు వాడింది. లేపనాలు రాసంది. ఫలితంలేదు. బాధ తగ్గలేదు సరికదా విపరీతమైన పోటు. డాక్టరుకు చూపించే స్థోమత లేదు. ఇలా బాధ పడుతూఉండగా శ్రీబాబు వచ్చారు.

శ్రీబాబు చూసి "డాక్టరుకి చూపించారా?" అని అడిగారు. "లేదు" అని సమాధానం చెప్పారు. " ఇది రాచకురుపు (క్యాన్సర్). బాగా ముదిరింది. నయమవటం కష్టం" అన్నారు. "మాకు మీరే దిక్కు మీరే నయం చేయాలి" అని ప్రాధేయపడ్డారు. "సరే! నేను మందు ఇస్తాను. కొన్ని నెలలు తీసికోవాలి చెప్పిన రీతిగా అనుపానం చెయ్యాలి. ఈ మందు బాగా వేడి చేస్తుంది. పాలు, మజ్జిగ తీసికోవాలి" అని చేప్పి మందు ఇచ్చి వెళ్లిపోయారు.

ఈ సారి నాలుగైదు నెలలకు గాని రాలేదు. శ్రీగున్నప్పగారి భార్యకు నయం కాలేదు. ఇంకా బాధ ఎక్కువైంది. ఆమె శ్రీబాబు వద్దకు వచ్చి ఏడ్చింది. "మీరు మందు సరిగ్గా నేను చెప్పిన అనుపానంతో వేసుకున్నారా? పాలు, మజ్జిగ తీసుకుంటున్నారా?" అని అడిగారు. వారికి పాలు, మజ్జిగలు ఎక్కడివి? వారు తీసికోలేదని చెప్పారు. "ఈ మందు వేడి చేస్తుందని చెప్పాను కదా. రోగం తగ్గలేదంటే నేను ఏమిచెయ్యను?" అన్నారు. శ్రీబాబు దాయార్ద్ర హృదయులు కదా! మందులో ఏదో మార్పు చేసి ఇచ్చారు. శ్రీబాబు వెళ్ళిపోయారు. ఆశ్చర్యం! ఆ పుండు మాను పట్టి ఆమెకు పూర్తి స్వస్థత చేకూరింది. ఆరోజులలో రేడియం ట్రీట్‌మెంట్లు అవీ లేవు. క్యాన్సర్ వ్యాధికి మందు లేదు అని చెప్పేవారు. శ్రీబాబు దయవల్ల ఆమెకు వచ్చిన రణం తగ్గి పూర్తి స్వస్థత పొందింది.

■

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గతసంచిక తరువాయి) -సుశీలా ప్రసాద

తన తియ్యని జలాలతో దాహం తీర్చుకుంటున్న మహర్షులను తన నయన కమలాలతో చూసింది యమునానది. పరవశయై కెరటాల చేతులెత్తి నమస్కరించింది. తన తరంగాల ధ్వనులతో వినయంగా ఆహ్వానం పలికింది. తీరానగల ఇసుక తిన్నెలపైన ఆసనాలర్పించింది. ఆమె చూపిన ఆదరాభిమానాలతో ముదమందిన మునీశ్వరులను "మహానుభావులారా! తమరీవిధంగా యీ తావుకు విచ్చేసిన కారణమేమ"ని ప్రశ్నించింది.

"చూడు తల్లీ! మేము అవతారపురుషుడైన నందనందనుని చూడాలనే ఆకాంక్షతో యీ వ్రజభూమికి వచ్చాము. దేవదేవుని దివ్య సందర్శన భాగ్యం తప్పక కలగ గలదనే ఆశాబీజాలను కైలాసనాధుడు మా హృదయ క్షేత్రాలలో నాటినందున అవి అంకురించి, మొలకెత్తి ఫలించగలందుకు జలరూపమైన నువ్వేవిధంగానైనా సహకరించి మాకు సహాయం చేయగలవా?" అని అనునయంగా అడిగారు.

"తపోధనులారా! బాలముకుందుడు తన ఆటపాటలతో అనునిత్యం సమస్త జీవకోటిని అలరించే ఆనంద ధామం యిదే. తీరానగల పావన బృందావన వీధులలో స్వామి నడయాడేటప్పుడు సర్వప్రకృతి ఒళ్ళంతా కళ్ళు చేసుకుని బాల గోపాలుని దివ్యమంగళ మూర్తిని తిలకిస్తూ పులకరించి పోతుంటుంది. మీరు అసలైన దోవనే వచ్చారు. ఇక్కడి అణువణువు ఆ పుణ్యమూర్తి సన్నిధిలో పునీతమై, ఆనందాబ్ధిలో ఓలలాడుతూ ఉంటుంది" అన్నది యమున.

యమున మాటలు వింటూ నిజనాధుని దర్శనానికి తహతహలాడే హృదయాలతో వారు నదీమతల్లి వంక చూశారు. నదిలో విహరిస్తున్న హంసలు సోzహమ్ అని పలుకుతున్నాయి. ఆవేళ దైవమే దారిచూపినట్లుగా ఒక ఉపాయం తటిల్లత వలె వారి మనస్సులో మెరిసింది. "అమ్మా! నువ్వు వర్ణించిన ఆ లీలా కిశోరుని వైభవాన్ని అనునిత్యం చూసే భాగ్యం పొందేందుకు నీ సహాయంతో..." అంటూనే రాజహంస రూపాలు ధరించి ఆ క్షణానే చల్లని కాళిందీ జలాలలో ప్రవేశించారు. వారి ఆలోచనకు యమున ఆనంద తాండవం చేసింది.

లక్ష్మీనివాసములైన తామర తోటలు యమునా నదీజలాలలో సమృద్ధిగా ఉన్నాయి. హంస రూపులైన మునులు పావనమైన అమృత సమానమైన నీటిని పానం చేస్తూ, లేత తామరతూడులను భుజిస్తూ తమతమ ధ్యానానుష్ఠానాలను కొనసాగిస్తూ వస్తున్న వేళ..... యమునా నదిలో నీటికోసం వచ్చే వ్రజభామలు సదా సర్వదా గోపబాలుని లీలలే, మహిమలే ముచ్చటిస్తూ, కాలం ఎంత గడిచిందో కూడా తెలియక తన్మయులై నిలిచిపోయే తరుణంలో .... అవన్నీ వీనుల విందుగా వింటూ, స్వామి దర్శనం ఎప్పుడెప్పుడాయని ఆవేదన, తపన నిండిన హృదయాలతో మహర్షులు ఎదురు చూస్తున్న సమాయన.... అప్పుడు వారి తపస్సు ఫలించిందా అన్నట్లు వినవచ్చిందా మువ్వల సవ్వడి!

ఇప్పుడిదాకా గోపకాంతల చేతి గాజుల గలగలలు, మెడలో హారాల, కాలి కడియాల శబ్దాలు వింటున్నవారికి, అపూర్వమైన అద్భుతమైన అతి మనోహరమైన ఆ నాదం ఉదాత్తానుదాత్తాల స్వరాలుచ్చరించే బ్రహ్మదేవుని వేదవాణి అందులో ప్రతిధ్వనించి వినవచ్చింది. ధ్యాన నిమగ్నులైన మునులు చప్పున కళ్ళు తెరిచి చూశారు.

నదీతీరాన దివ్యాకృతిగల శ్యామల వర్ణుడైన బాలుడు సంచరిస్తూ కనిపించాడు. వాని కనుల అందం, మోము చందం, అవయవ సౌందర్యం సృష్టికర్తయైన బ్రహ్మదేవునికి కూడా అబ్బురమనిపించేటంత అపూర్వమై విలసిల్లుతోంది. రాజహంస స్వరూపులైన మునీశ్వరులు మరోమారు ఆ నల్లని వాని చూసి చూసి పరవశులైపోయారు. యదునాథుడు వారిని గుర్తించి చిరునవ్వులు చిందించగా వనమంతా ఆ నవ్వులు వెన్నెలలై వెలిగాయి. ముగ్ధులైన మునీశ్వరులు గోపకాంతామనోహరుడైన శ్రీకృష్ణుని మంద గమనంతో మ్రోగుతున్న రతనాల అందెల మువ్వల సవ్వడిలోని ప్రణవనాదాన్ని హంస స్వరూపులై తమతమ గొంతులలో నింపుకుని, తిరిగి తిరిగి పలుకగా ఆ ధ్వనులు విశ్వమంతా నిండిపోయాయి.

శ్రీ నివాసమైన తామరతోటల యందు సంచరించే యమునానదిలోని రాజహంసల గొంతులందలి మధురధ్వనితో కలిసిన గోపకాంతా విభుడైన శ్రీకృష్ణుని రతనపుటందియల మనోహరమైన మ్రోత నా చిత్తమందు ప్రకాశించు గాక!

■

# పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

"లౌక్యం అనేది చాల ప్రమాదకరమైనది. అది సాధకునికి ప్రతిబంధకమే" అన్న శ్రీబాబూజీ మహరాజ్ బోధని పురస్కరించుకుని ఒక భక్తుడు 'లౌక్యం అంటే ఏమిటి?' అన్న ప్రశ్నకు సమాధానంగా బోధని కొనసాగిస్తూ "నీ ఇష్టదైవం ఎవరు?" అని ప్రశ్నించారు. ఆ భక్తుడు తికమక పడిపోయాడు. 'నాకుగా గురుదేవునికి మించిన దైవము లేదు' అన్నాడు. శ్రీబాబు మాట్లాడుతూ "దీనినే లౌక్యం అంటారు. మాతృగర్భంలోనే గురూపదేశం పొందిన ప్రహ్లాదుని విషయం నేను కాదనను కాని నేనెవరో బాల్యం నుంచి తెలుసా? ఇదే లౌక్యం అంటే. లౌక్యం మొలగజ్జి లాంటిది. దానిని వదిలించటం చాల కష్టం. దానిని వదిలించుకుంటేగాని సద్గురుమూర్తి యందు విశ్వాసం నిలవదు. మనస్సులో ఉండే భావము వేరు. బయటకి వ్యక్తం చేసే అభిప్రాయం వేరు. మనస్సులో భావన వ్యక్తం చేస్తే ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో అని భయం. నీ ఎదురుగా ఉన్న వ్యక్తిని మభ్యపెట్టటానికి, సంతోషపెట్టటానికి మనస్సులో ఉన్న భావానికి భిన్నమైన భావాన్ని వ్యక్తం చేస్తారు.

కాని సద్గురుమూర్తి సమక్షంలో లౌక్యానికి స్థానం లేదు. నీ మనస్సులో ఏ భావం ఉందో ఆయనకి తెలియదా! నీ మనస్సుని దాయలేవు గదా! నీవు కళ్ళు మూసుకుని కూర్చుని ఉన్నా, ఏ స్థితిలో ఉన్నా నీ శరీరం మీద ఈగ వ్రాలినా, దోమ కుట్టినా గ్రహించ గల్గుతున్నావు కదా! నీ మనస్సు దేహమంతా వ్యాప్తమై ఉండటం వలననే కదా! నీ మనస్సుని యింద్రియాలనీ ప్రకాశించే ఆత్మ వస్తువుతో అనుక్షణం తాదాత్మ్యం పొంది ఆనంద సాగరంలో ఓలలాడే సర్వవ్యాపకుడైన సద్గురుమూర్తికి నీ మనస్సు దాయగలవా! లౌక్యాన్ని జయించనివాడు లౌకిక ఆనందమే శాశ్వతమనుకుంటాడు. లౌక్యనికి మూలం దేహాభిమానం. ఒక వ్యకి రైలులోనో, బస్సులోనో ప్రయాణం చేస్తూ ఉంటాడు. అపరిచితులైన వ్యక్తులతో సంభాషణ చేస్తాడు. ఆ అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగతమైనవి, కుటుంబ వ్యవహారాలు చర్చించటానికి వెనుకాడడు కదా! ఇంతలో సిగరెట్టు కాల్చవలసి వస్తుంది. సిగరెట్టు ఉందికాని, అగ్గిపెట్టె లేదు. ఆ అపరిచితమైన వ్యక్తుల్ని అగ్గిపెట్టె ఇమ్మని అర్థించకుండా ఉండగలడా! మరి అక్కడ దేహాభిమానం యేమైనట్లు?మానవుడు పిపీలికాది బ్రహ్మ పర్యంతము వ్యాప్తమై ఉన్న గురుకాంతిని తెలుసుకో గలుగుతాడా! ఎక్కడో లోకంబులు లోకేసులు, లోకస్థులను దాటి పెంజీకటికవ్వల గురుకాంతి ప్రకాశిస్తోందని భావిస్తాడు అదే అజ్ఞానము. ఆ అజ్ఞానమే లౌక్య భావనకి హేతువు!

## శ్రీ బాబూజీ దివ్యవాణి

ఇంతకు ముందు వివరించిన సూత్రాల ప్రకారం ఆలోచించిన మానవుడెన్నడూ తప్పుదోవ త్రొక్కడు. అధర్మానికి పూనుకోడు. అత్యధిక లాభాల కోసం అతడు శ్రమించినా, అతనిలో పేరాశ ఉండదు. అతడు తన క్రింది ఉద్యోగులను, శ్రామికులను బాధించడు. ప్రభుత్వాన్ని గాని, ప్రజలను గాని మోసం చేసే పని అతనికి లేనే లేదు. సమ్మెలకు, ఆందోళనలకు, మూసివేతలకు అక్కడ ఆస్కారమే ఉండదు. విచారణ సంఘాలకు, మధ్యవర్తిత్వాలకు అవసరం అసలే ఉండదు. రాను రాను, తన కృషి అంతా ఒక ఆధ్యాత్మిక కృషిగా, ఒక తపస్సుగా అతనికి అర్థమవుతుంది. ఈ మహత్తర కృషిని విజయవంతంగా నిర్వహించటం ద్వారానే తాను అత్యున్నత ఆధ్యాత్మిక శిఖరాలను అందుకోవచ్చు. తన ప్రభువు ప్రేమకు పాత్రుడు కావచ్చు.

అలా ఆచరించిన పారిశ్రామిక వేత్త తన కుటుంబ సభ్యుల ప్రేమాదరాలను చూరగొనటమే కాక, తన ఉద్యోగులందరి మన్ననలకు, ప్రేమకు పాత్రుడు కాగలడు. సమర్థుడైన ఒక గొప్ప పారిశ్రామిక వేత్తగా మాత్రమేగాక, ఉదార హృదయుడైన ఒక మహా ధార్మికునిగా కూడా అతడు తన దేశంలోను, ఇతర దేశాలలోను కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించుకోగలడు.

అంతేకాదు, తన ఆచరణద్వారా అతడు తన క్రింది ఉద్యోగులకు, శ్రామికులకు అందరికి ఆదర్శ ప్రాయుడై నిలిచి, తనవలెనే వాళ్ళు కూడ తమ తమ విధి నిర్వహణను కర్మ యోగ సాధనగా భావించి ఆచరించటానికి తగిన స్ఫూర్తిని, ప్రోత్సాహాన్ని అందివ్వగలడు. అటువంటి యజమానిలో ఆ ఉద్యోగులు ఒక అధినేతనే గాక, తమను ప్రేమించే పితృసమానుడైన ఉదారుని, తమ కుటుంబాల అభ్యున్నతిని కోరే స్నేహితుని, తమ ఐహిక ఆధ్యాత్మిక పురోగతిని కాంక్షించే మహాత్ముని, తమకు మార్గదర్శకుడైన ఆదర్శ పురుషుడిని పొందగలరు. ఇక ఆ ఉద్యోగులు, శ్రామికులు, సంకుచిత తత్వాలను విడనాడి పరస్పర విశ్వాసం, అవగాహన, సౌభ్రాతృత్వం పెంపొందించుకొంటారు. తమ తమ విధులను సక్రమంగాను, చిత్తశుద్ధితోను నిర్వహించటం ద్వారా తమ యజమానికే కాక, భగవానునికి కూడా తాము

అత్యంత సన్నిహితులము, ప్రీతి పాత్రులము కాగలమని తెలుసుకో గలరు.

ఇదంతా ఒక మహత్తర శుభ పరిణామ పరంపరకు దారితీస్తుంది. ఆదర్శ ప్రాయుడైన ఆ పారిశ్రామిక వేత్త వలన ఆదర్శప్రాయులైన శ్రామికులు రూపొందుతారు. వారంతా కలసి అత్యుత్తమ శ్రేణికి చెందిన పదార్థాన్ని తమ పరిశ్రమ ద్వారా భారీస్థాయిలో ఉత్పత్తి చేసి బ్రహ్మాండమైన లాభాలను ఆర్జించగలరు. వాళ్ళ కుటుంబాలన్నీ సుఖశాంతులతోను, సంతృప్తి తోను ఆధ్యాత్మిక దృష్టితోను మనగలవు. ప్రజలు, ప్రభుత్వమూ కూడా ఆ పరిశ్రమను, ఆ పారిశ్రామికులను ఎంతగానో అభిమానించి ఆదరిస్తారు. వాళ్ళకు తగినంత ప్రోత్సాహాన్ని అందిస్తారు. అంతే కాదు! ఆ పరిశ్రమ అభివృద్ధి విషయంలో ఎంతో ఆసక్తి చూపుతూ, వారి కుటుంబాల అభ్యున్నతికి ఎంతో దోహదం చేస్తారు. ఈ సంస్థలో యజమానికి, ఉద్యోగులకు మధ్య ఈ విధంగానే నెలకొన్న అత్యుత్తమ సంబంధాలు, ఏర్పడిన నైతిక, సాంఘిక మానవతా విలువలు ఇతర పరిశ్రమల వాళ్ళకు కూడా అనుసరణీయంగా ఉండగలవు. ఈ విధంగా చిత్తశుద్ధి, కర్తవ్యపరాయణత, భగవద్విశ్వాసంగల కర్మ నిష్ఠులను తయారు చేయుటం ద్వారా ఉత్తమ కర్మయోగానుష్ఠానికి అనుకూలమైన వాతావరణం దేశమంతటా నెలకొనగలదు. అది ఇతర దేశాలకు కూడా మార్గదర్శకమై విశ్వ కళ్యాణకారకం కాగలదు.

ఈ మహత్తర శుభ పరిణామ పరంపరకు సంతోషించి, దయమయుడైన భగవానుడు ఆ సంస్థపైన, ఆ యజమానిపైన, ఆ ఉద్యోగులపైన, వారి కుటుంబ సభ్యులపైన, వారిని అభిమానించే ప్రజలపైన, ప్రభుత్వం పైన కూడా తన అమోఘమైన ఆశీస్సులను సంతత ధారగా వర్షించగలడు.

**స్వీయవృత్తిలో అనురక్తి**
**భగవానునిపై నిర్మల భక్తి**
**అది కర్మ యోగంలో యుక్తి**
**అది చాలును పొందించు ముక్తి.**

శ్రీహనుమత్కాళీ వరప్రసాదబాబుగారి కలకత్తా ప్రసంగంలో చివరి భాగం ఇది.

■

# భగవత్సాక్షాత్కారము

- రమణ ప్రసాద్

గరిక చాపపైన జటలు కట్టిన జుట్టుతో రఘురాముని నామం నిరంతరాయంగా జపిస్తూ, పద్మములవంటి కన్నులనుండి అశ్రుధారలు జాలువారుతూ కన్నీటితో తడిసిన శరీరంతో కూర్చునిఉన్న భరతున హనుమంతుడు చూశాడు. హనుమంతునితో భరతుని కలయిక తరువాత శ్రీరాముడు భరతుని కలిసినప్పుడు, శ్రీరాముని కన్నులనుండి అశ్రుధారలు కారుతుండగా ఆ త్రిలోకనాథుడు భరతుని ఆలింగనం చేసుకుని తన హృదయానికి హత్తుకున్నాడు. అవ్యాజమైన కరుణ, ప్రేమ సాకారరూపం ధరించివచ్చినట్లుగా వారిరువురూ గాఢ పరిష్వంగంలో ఉనిడిపోయారు.

అవ్యాజకరుణకు ప్రతినిధి శ్రీరాముడైతే ప్రేమ స్వరూపానికి ప్రతినిధి భరతుడు. అంతట శ్రీరాముడు భరతుని కుశలమును తెలుసుకున్నాడు. వారిరువురూ పొందిన ఆనందము వర్ణనాతీతం. నన్ను ఎడబాటు అనే సముద్రంలో మునిగిపోకుండా కాపాడినందుకు కృతజ్ఞుడిని" అని రామునితో అన్నాడు భరతుడు.

ఎవరైతే మానావమానాలను విడిచి, రాచమర్యాదను పాటించక భగవానుని పద చిహ్నములు పడిన మట్టిలో అక్రూరునివలె పొర్లాడుతారో వారికి తన దర్శనభాగ్యాన్ని కలుగచేస్తాడు భగవంతుడు.

అక్రూరుని గురించి శ్రీమద్భాగవతంలో ఈ విధంగా చెప్పబడింది - అది అక్రూరుడు రాజ్యం ఏలుతున్నకాలం. అక్రూరుడు శ్రీహరి పదచిహ్నాలను చూశాడు. ఎవరి పాదధూళిని ఇంద్రాది దేవతలు శిరస్సున ధరిస్తారో ఆ పద చిహ్నాలను అతడు చూశాడు. శంఖ, చక్ర, పద్మముల గుర్తులతో ఉన్న ఆపదచిహ్నాలు నిశ్చయంగా శ్రీహరివే. సందేహంలేదు. పరమానందభరితుడై, మేను పులకరించగా, ఆనందాశ్రువులు జాలువారుతుండగా అక్రూరుడు తన రథం దిగి భగవంతుని పదచిహ్నాలపైన ఆనందపారవశ్యంతో పొర్లాడాడు. అక్రూరునివలె హరిపదచిహ్నాముల మహాత్మ్యమును

తెలుసుకున్నప్పుడే మానవజన్మకు సార్థకత.

ఉద్ధవుడు జ్ఞానిననే అహంభావాన్ని వీడి, బృందావనంలో గోపికల ప్రేమ తత్త్వంలో గ్రుంకులిడి భగవత్ సాక్షాత్కారానికై ఎలా విలపించాడో, అలా భగవంతునికై పరితపిస్తే భగవంతుడు తప్పక దర్శనం ఇస్తాడు.

ప్రతిక్షణం అంతిమక్షణంగా భావించి, ప్రళయం సంభవించినపుడు ఎంత విహ్వలత చెందుతామో, ఎలా హృదయపు లోతులలోనుంచి రుక్మిణి ఎలా విలపించిందో, అలా విలపిస్తే భగవంతుని దర్శనం తప్పక కలుగుతుంది.

ఋషి మునులకు ఇచ్చిన వాగ్దానాన్ని చెల్లించటానికి, తన కుమారుని తలను నరకటానికి కూడ వెనుదీయని మయూరధ్వజ మహారాజువలే ఉన్నయెడల భగవద్దర్శనము తప్పక కలుగుతుంది.

భక్తి పారవశ్యంతో భగవంతుని కీర్తించుచూ, మానావమానములను లెక్కచేయక భగవద్ధానము చేసిన భక్త నరసింహ మెహతా వలె ఉండినచో భగవంతుని గాంచగలడు.

నవవిధభక్తులలోని సాధనాక్రమాన్ని పాటించినచో భగవంతుని గాంచగలము. భగవానుడు ఎదుట సాక్షాత్కరించుటయే కాక, భక్తుడు ఒసగే పదార్థములను ప్రీతితోస్వీకరిస్తాడు. ద్రౌపది, గజేంద్రుడు, శబరి, విదురుడు మున్నగు భక్తులు ఇందుకు తార్కాణములు.

భగవానుడు భగవద్గీతలో ఇలా చెప్పాడు -
"ఎవరైనా నాకు పత్ర,పుష్ప,ఫల,తోయములలో ఏ ఒకటియైనను భక్తిపూర్వకంగా సమర్పిస్తాడో అట్టిదానిని నేను ప్రీతితో స్వీకరిస్తాను."

కాబట్టి భగవద్దర్శనానికి తపించాలి. వ్యాకులతతో ప్రార్థించాలి. భగవంతుని ప్రేమకై గాఢమైన ఆవేదన చెందాలి.

-సశేషం

# వార్తలు- విశేషాలు




11-7-2011న, తొలిఏకాదశినాడు శ్రీసద్గురుపాద పూజచేసుకుంటున్న మద్ది రాధాబాయి, నందగోపాల్ వారిసతీమణి.



10-7-2011న, ఢిల్లీలో శ్రీసద్గురుపాద పూజచేసుకుంటున్న జి.శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, మరియు జి.వై.నారాయణ గాయత్రి దంపతులు.



14-7-2011 న, విదేశీయాత్ర ముగించుకుని ఆశ్రమానికి
తిరిగి వస్తున్న సందర్భంలో విజయవాడ స్టేషన్‌లో శ్రీమాతాజీవారికి
స్వాగతం పలుకుతున్న భక్తులు.



15-7-2011న, ఆషాఢపూర్ణిమనాడు శ్రీసద్గురుపాద పూజ సమయంలో
గురుపాదుకలకు అభిషేకం చేసుకుంటున్న భక్తులు

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి)

- విజయేశ్వరానంద ప్రసాద్

తన ఆరాధ్య దైవమైన బాలరామునిగా గుర్తించిన క్షణం నుండి పరశురామయ్య గారు శ్రీబాబును దైవసమానంగానే చూసుకున్నారు. కాని వయోభేదాన్ని బట్టి ప్రేమగా "బాబూ" అని నోరార పిలుచుకునేవారు. బాల్యంలోనే మాతా పితరులకు దూరమైన శ్రీ బాబు కూడ, శ్రీ పరశురామయ్య గారిని జనకమహర్షి వంటి జ్ఞానిగా పితృతుల్యునిగా భావించి "నాన్నగారూ" అని నోరార పిలుచుకున్నారు. వారిరువురి అన్యోన్యానుబంధము అలౌకికము, ఆత్మీయము, అద్వితీయము. ఎక్కడా, ఎప్పుడూ, ఎవ్వరికీ అంతు చిక్కని శ్రీ బాబు కూడా - అదేమి అనుబంధమోగాని - శ్రీ పరశురామయ్య గారి వద్ద అలా, అంత సన్నిహితంగాను, అరమరిక లేకుండాను మెలగేవారు. శ్రీ బాబు స్నానానికి, భోజనానికి కావలసిన ఏర్పాట్లన్నీ శ్రీ పరశురామయ్య గారు స్వయంగా చేయించేవారు. దగ్గర కూర్చుని భోజనం తినిపించేవారు.



తమ జ్ఞాన సంపదను తరగని పెన్నిధిగా పెంపొందించగల సమర్థులు శ్రీ బాబే అని గుర్తించిన శ్రీ పరశురామయ్య గారు, శ్రీ బాబును ' నా జ్ఞాన పుత్రుడు" అనేవారు. శ్రీ పరశురామయ్యగారు శ్రీ బాబు యెడల చూపిన భక్తి వాత్సల్య భావములతోను, శ్రీబాబు వారి యెడల చూపిన అన్యోన్యతతోను ప్రభావితులైన కొలది, శ్రీ పరశురామయ్యగారి కుటుంబ సభ్యులకు కుల ప్రసక్తి , వర్ణ విచక్షణ తొలగిపోయాయి.

పరశురామయ్యగారితో శ్రీబాబు జరిపిన వేదాంత గోష్ఠులను గూర్చి వివరించాలంటే, జ్ఞాన సంపన్నులకే అలవి కాదు. ఆ గోష్ఠులు వారి వలెనే దేశ కాలాతీతములుగా ఉండేవి. వారిరువురు ఎవరికి వారే, ఎప్పుడు పడితే అప్పుడే, ఎక్కడ పడితే అక్కడే, కాలగమనంతో నిమిత్తం లేకుండా ఆత్మ విచారణ చేసుకుంటూ, ఆనందాంబుధిలో ఓలలాడుతూ, తన్మయత్వాన్ని పొందుతూ,

పరిసరాలను, లోకాన్ని మరచిపోయి - మరచిపోవడమేమిటి - దాని (లోకపు) మిధ్యాత్వాన్ని ఆరూఢంగా అనుభూతి పొందుతూ ఉండిపోయే అలవాటు కలవారు. ఇక ఇద్దరూ సమావేశమైతే ఎలా జరిగేదో గ్రహించవచ్చును.

ఉదాహరణకు - పరశురామయ్యగారికి ఉదయము సాయంత్రము కూడా చాలా పెందలకడనే భోజనం ముగించుకోవడం అలవాటు. కాని శ్రీబాబు వచ్చినప్పుడు మాత్రం ఇద్దరూ వడ్డన చేయించుకుని భోజనానికి ఉపక్రమించే వారు. శ్రీపరశురామయ్యగారు, తాము పరిమిత భోజనులైనా, శ్రీబాబుకు కొసరి కొసరి వడ్డన చేయించే వారు. "మరి కొంచెం కూర కలుపుకోండి బాబూ! ఆ పప్పు కలుపుకొని నెయ్యి మరికాస్త వేయించుకోండి బాబూ! " అని కలిపించి తినిపించాలని ప్రయత్నం చేసేవారు.

శ్రీబాబు సాధన కాలంలో ఒక ముద్ద మాత్రమే తిని ఉన్న రోజులు కూడా ఉన్నాయి. అతి పరిమిత భోజనులు వారు. అందుచేత పరశురామయ్యగారి తాకిడి నుంచి మరలించటానికి, "నాన్నగారూ! పప్పులో వేసిన ఈ మామిడికాయ పచ్చిగా ఉన్నప్పుడు, ఇంత పుల్లగా ఉంది కదా! మరి, బాగా పండేసరికి దాని రంగూ, రుచీ, వాసనా అన్నీ మారిపోయి అంత మధురంగా, బంగారు రంగులో అంత ఆకర్షణీయంగా, ఎప్పుడు తిందామా అని అందరినీ నోరూరించేటట్లుగా తయారవుతున్నదే! - ఎంత మార్పు!

మానవుడు కూడా, బాగా పచ్చిమీద ఉన్నప్పుడు, అంటే ఉరకలు వేసే యవ్వనంలో అహంకార మమకారాలతో కూడి ఉన్నప్పుడు, పులుపుతో పచ్చితనంతో ఉన్న మామిడికాయ వంటివాడు. అదే మానవుడు, సాధనలో బాగా పండి, పరిణతి పొందినపుడు, అతని అహంకారము, మమకారము, (పులుపు,పచ్చితనమూ) భక్తి , వైరాగ్యములుగా (తీపి, బంగారు లేక కాషాయ రంగు) మారిపోతాయి. అందరికీ ప్రేమ పాత్రుడవుతాడు. అంతేకాక, తనలోని జ్ఞానమనే మధురరసాన్ని అందరికీ అందించి, అజ్ఞానమనే 'ఆకలి'ని పోగొట్టగలుగుతాడు" అని అంటూ, ఆ భోజనం నుంచే వేదాంత చర్చలోకి దింపేవారు.

- సశేషం.

# మౌనధ్యాన సప్తాహ శిబిరం

-రమణ ప్రసాద్

మనం రోజూ శ్రవణ,మనన,నిదిధ్యాసలలోనే ఉంటున్నాము. ఆ ధ్యాస బాహ్యపరమైనప్పుడు చాలా మాటలు వింటున్నాము. వాటిని గుర్తుపెట్టుకుంటున్నాము. ఇతరులకు అంటిస్తున్నాము. దూలగుండ దురదనీ, దుఃఖాన్నీ ఇస్తుంది. మరి సత్సంగం మనను తరింపచేస్తుంది.

ఒక మంచిమాట చెపుతాను వినుమా...

మహాత్ములు ఈ ఒక్కమాట వినరా! అని సంకీర్తనపూర్వకంగా, విచారణపూర్వకంగా అందిస్తున్నారు. బోధరూపంలో అందిస్తున్నారు. చెప్తున్నాను వినరా! అంటే దానిని చెయ్యి! అని. కాని మనం దానిని స్వతంత్రంగా తీసుకుంటున్నాము. దానితో గుణాలు ప్రవృద్ధి చెందుతాయి. అవి- కామం క్రోధం, ఈర్ష్య అసూయలు, ఓర్వలేనితనం. అంతఃకరణ పవిత్రంగా ఉండాలంటే మంచి విషయాలను వినాలి. మన ప్రార్థనలో.......

అవ్యాజకరుణాముర్తీ!

తను మన ధనములతో సదా ఇతరులకు మంచినే చేయుటకును, మంచినే చూచుటకును, మంచినే గ్రహించుటకును తగిన సద్బుద్ధిని మాకు దయ చేయుము! - అని రోజూ చెప్పుకుంటాము. మనస్సుచెప్తుంది. కాని విచక్షణా జ్ఞానాన్ని ఇచ్చేది మనస్సు వెనక ఉన్న బుద్ధి. ఈ బుద్ధి, మనస్సు, ఇంద్రియాలు చైతన్యం ఉంటేనే పని చేస్తాయి. చైతన్యం సర్వ వ్యాపకం.

ఒక సన్నివేశం చెపుతా- గుంటూరులో పాండుగారిఇంట్లో ఆ రోజు భోగిపళ్ళు శ్రీ బాబుకు పొయ్యటానికని మూడవ అంతస్థులో సింహాసనంవేశారు. నేను మెట్లమీద నుంచుని ఉన్నాను. భోగిపళ్ళు పోసేముందు శ్రీబాబుకు హారతి ఇచ్చారు. కర్తలతోపాటు నేను నమస్కారం చేశాను. భోగిపళ్ళు పోయటం మొదలుపెట్టాం. భక్తులు నా మీదనించి వెళ్ళి పళ్ళకోసం ఎగబడుతున్నారు. ఎవరు ఎన్ని తీసుకుంటే అన్ని! ఆయన జుట్టు పీకేవారు. నువ్వు ఎంత తింటే అంత తిను. నామరూపంతో తింటావో, ప్రసాదరూపంలో తింటావో నీ ఇష్టం. నేను లేవాలని ప్రయత్నం చేస్తున్నాను కాని లేవలేకపోతున్నాను. గురుదేవులు నిర్లిప్తంగా ఉన్నారు. చైతన్యానికి అది అవసరమా? జన్మ లేకుండా చేస్తాను అని అభయం ఇచ్చారు గురుదేవులు. ఇక భయం ఎందుకు?

సద్బుద్ధిని ప్రసాదించమని కోరుకోవాలి! నీ తను, మన , ధనములతో అంటే చరణాల వద్దఉండే సద్బుద్ధిని ప్రసాదించు ప్రభూ! బుద్ధి కూడా చైతన్యం లేకపోతే ప్రకాశించదు.

నా భక్తుడు నాకు అత్యంత ప్రియుడు అని చెప్పాడు భగవానుడు భగవద్గీతలో...........

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ యేవచ ।**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖః క్షమీ ॥**

భక్తియోగంలో చెప్పిన గుణాలలో ఒక్క గుణమైనా మనలో ఉందా?

మంచి మనసును మించిన దైవము - మహిలో కలదా నరుడా
ఇది మరువకురా పామరుడా ॥

గోవుల వన్నెలు ఎన్నైనా - అవి కురిసే పాలు ఒకటేరా
నదీనదమ్ములు ఎన్నైనా - అవి కలిసే సాగరమొకటేరా
దేవుని నామములెన్నైనా -దీవించే దైవం ఒకటేరా ॥

'ఆశ లేనివాడే గొప్పవాడు' అని చెప్పారు మన గురుదేవులు. భావనను బట్టి ఉంటుంది. సద్భావనకోసం వెతుక్కోవాలి. ఎందుకంటే భగవంతుడు మనలోను, మన ప్రతి అలికిడిలోను ప్రకాశిస్తున్నాడు. నువ్వు శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించటానికి తిరుపతి వెళ్ళావు. దర్శనానికి లైన్‌లో ఉన్నావు. కొందరు తొందరపడితే, కొందరు అప్పుడే వెళ్ళటమా అనుకుంటున్నారు. ఇటువంటి అనుభవమే నాకు ఎదురైంది. నేను తిరుపతిలో లైన్‌లో నడుస్తున్నాను. నా ముందరవాళ్లు తొందర పడుతున్నారు. కొందరు "అమ్మా! మీరు టీ.వీలో వచ్చే మాతాజీ కదూ" అని అడిగారు. నేను ఔనని గోవింద నామ స్మరణ చేస్తు ముందుకు నడిచాను. నా ముందున్న వారిని మాటలు ఆపి గోవిందనామం అనమన్నాను.

గురుబోధను విచారణ చేయండి. విచారణ చేస్తే మనశ్శాంతి లభిస్తుంది. విచారణ చేయనప్పుడు భగవన్నామం చెయ్యండి. నామస్మరణతో పాటు ఇంద్రియాలను చేరిస్తే మనస్సు నిశ్చలస్థితికి చేరుకుటుది. దీనికి మంచి ఉపమానం గురుదేవులు చెప్పేవారు. బావ బావమరదులు సిగరెట్టు కాలస్తూ, మాట్లాడుతూ నిద్రలోకి జారిపోయారు. సిగరెట్టుతో చెయ్యి కాలేసరికి మెళకువలోకి వచ్చారు. మనం కూడా భగవతుని ధ్యాసలో ఉంటే ఆ స్థితిని చేరుకుంటాం.

**ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్।**
**ఆత్మైవహ్యాత్మనా బంధు రాత్మైవరిపురాత్మనః ॥**

ఎప్పటికప్పుడు ట్రాక్ మీద ఉన్నామో, చేయతగినంత సాధన చేస్తున్నామా అని ఎవరికి వారు గమనించుకోవాలి. మనలోని దోషాలను గుర్తించటమే గురుదేవులకు విన్నవించుకోవటం. నింద్రకొలను శాఖలో ఒక అమ్మాయి గురువాణి నుంచి శ్రీబాబు బోధామృతం చదువుతూ "బ్రహ్మసత్యం జగన్మిధ్య"అని చదవటం మొదలుపెట్టింది. నేను చదివే ముందు గురుదేవులకు నమస్కారం చేసుకొని ఆ తరువాత "గురుబ్రహ్మ గురుర్విష్ణు..."చెప్పాలి, తరువాత బోధామృతం చదవాలి అని చెప్పాను. ఆ అమ్మాయి కళ్లు మూసుకుని గురుదేవులను ప్రార్థించుకుంది. కళ్ళు తెరిచాక "బాబూజీ కనిపించారా" అని అడిగాను. "కనిపించారు" అని చెప్పింది. "ఏమన్నారు?"అని అడిగాను. "తప్పులు లేకుండా చదవమన్నారు" చెప్పింది. ఈ అనుభూతిని ఎవరు ఇచ్చారు? గురుదేవులు ఇచ్చారు. మనంచేసే సాధన మనస్సు పెట్టి చేయాలి. మనకు మనమే హెచ్చరిక చేసుకుని సరిదిద్దుకోవాలి. వారినే అర్థించాలి.

**ముకుందమూర్ధ్నా ప్రణిపత్య యాచే**
**భవంతమేకాంతమియంత మర్థం ।**
**అవిస్మృతిః త్వచ్చరణారవిందే**
**భవే భవే మే z స్తు భవత్ప్రసాదాత్ ॥**

"ఓ ముకుందా! నాదొక చిన్న కోరిక. ప్రతిజన్మ మందును నీ పాదారవిందములపై నా తలపు ఉండునట్లు అనుగ్రహింపుము"

భగవత్ ప్రసాదం ఉంటే చాలు. ఎవరైతే ఆ పాదాలను ఆశ్రయించి ఉంటారో వారు తప్పక తరిస్తారు. ఆవేదన ఉండాలి. "నీ చరణారవిందములను మరచిపోకుండా చెయ్యమని యాచిస్తున్నామా? ఆయన అణువణువులో ప్రకాశిస్తున్నారు. శ్రీ గురుదేవులు ఎన్నెన్నో సేవలను మనకు ప్రసాదించారు. ఎన్నెన్నో మార్గాలు ఏర్పరిచారు. ధ్యానంలో ఒక పాట వచ్చింది. ఒక నామం వచ్చింది. దానిమీద మనస్సు నిలిచి ఏకాగ్రత చెందింది. మంచి అనుభూతి కలిగింది. అటువంటి హృదయబాబు యొక్క పరిపూర్ణ అనుగ్రహాన్ని మనమందరము పొందెదముగాక!. అట్టి భక్తిని, శక్తిని గురుదేవులు మనకు ప్రసాదించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# శత్రువుల పట్ల కూడా ఉదాత్తమైన కృప

(గత సంచిక తరువాయి) -సుషుమ్న ప్రసాద

సత్యార్థ మహారాజు నివారించకపోతే, దత్తుడు ముక్తనాధుడు చేసిన అపచారమునకు వెంటనే సంహరించేవాడు. కాని సత్యార్థుడు "దత్తా, అతనిని సంహరించకు. అతను నా మందిరంలోకి దురుద్దేశ్యంతో దుష్కార్యం చేయటానికి వచ్చినా శివాచార్యుని వేషంలో వచ్చాడు. వ్యక్తి యెట్టివాడైనను శివాచార్యుని వేషమునకు మనం గౌరవం యీయవలెను. సాధువేషధారిగా వచ్చిన దెవరైననూ మనం గౌరవించాలి. ముక్తనాధుడు శివాచార్య వేషధారియై వచ్చాడు. కావున నా ప్రజలెవరూ కూడ అతనికి హాని చేయకూడదని నా శాశనముగా చెప్పు. ప్రజలెవ్వరూ అతనికి హాని చేయకుండా అతని వెంట రక్షణగా నీవు వెళ్ళి, ముక్తనాధుని మన రాజ్య సరిహద్దుల నుండి బయటకు పంపించు.

దత్తుడు వెంటనే రోదిస్తూ "ఓ రాజా! ఒక అపాత్రుడిపై సానుభూతి చూపిస్తున్నారు. ముక్తనాధుడు నేరస్తుడు. ఇతడు శివాచార్యుని వేషమునకు అపచారము చేసి, అలా ఏకాంత మందిరంలోకి ప్రవేశించటం ఘోర అపరాధం. మీరు అనుమతిస్తే ఇతనిని వెంటనే సంహరిస్తాను" అన్నాడు.

కాని సత్యార్థుడు "దత్తా! అతనికి హాని చేయకు. శివాచార్యుడి వేషధారణచే నేను ముక్తనాధుని మిత్రుడుగా పరిగణిస్తున్నాను. అతని గురించి చెడుగా మాట్లాడకు. అతను నా రాజ్యమును తనకు ధారాదత్తము చేయమని కోరినా సంతోషంతో యిచ్చి ఉండేవాణ్ణి. ఎందుకంటే అతను శివభక్తుడిగా కోరుకుంటున్నాడని, ఆ ఆనందంతో రాజ్యమును సమర్పించేవాడిని. ఇక ఆలశ్యం చేయకుండా, అతనికి ఏ ఆపదా కలుగకుండా, వదలి రా! నా ఆజ్ఞ పాలించి, అతనిని క్షేమంగా గమ్యం చేర్చేవరకూ వేచి ఉంటాను" అన్నాడు.

దత్తునకు రాజాజ్ఞ పాలించటం తప్ప మరో గత్యంతరం లేక దుర్మార్గుడయిన మక్తునాధుని వదలివేయవలసి వచ్చినందుకు బాధపడుతూ, శత్రురాజునకు అంగరక్షకుడయ్యాడు. ముక్తనాధుని క్షేమంగా చేదిరాజ్యపు పొలిమేరలు దాటించి, రాజాజ్ఞ శిరసావహించానని చెప్పటానికి రాజప్రాసాదానికి తిరిగి వచ్చాడు.

ఈలోపల సత్యార్ధుడు తన కుమారులను, మంత్రులను పిలిచి, వారికి తాను చేసిన సత్కార్యాలను కొనసాగించమన్నాడు. వారికి శివభక్తులపట్ల నిరాదరము చూపించవద్దని సలహా ఇచ్చాడు. దత్తుడు తిరిగి వచ్చి, ముక్తనాధుణ్ణి క్షేమంగా దేశ సరిహద్దులు దాటించానని చెప్పగానే సత్యార్ధుడు ఆనందించాడు.

ఆ తరువాత సత్యార్ధుడు 'పంచాక్షరీ' మహామంత్రాన్ని తీవ్రంగా సాధన చేశాడు. తత్ఫలితంగా సత్యార్ధుడు ఉమామహేశ్వరుల దివ్యదర్శనం ఇచ్చి, అతనితో "నీ బద్ధ శత్రువును కూడా క్షమించి, ప్రాణభిక్ష పెట్టటం వలన, నీవు అత్యంత ప్రియమైన భక్తుడవైనావు" అని అంటుండగానే సత్యార్ధుడు పరమేశ్వరునిలో లయమైపోయాడు.

తమిళంలో సత్యార్ధుడు అంటే సత్యపదార్థము అని అర్థం. అప్పటి నుండి సత్యార్ధుడు 'పొరుల్ నాయనార్' గా ప్రసిద్ధి చెంది, అరవైమూడు మంది శైవమహా మునులలో ఒకడుగా ప్రకాశించాడు.

■

**"అయ్యా! నేరేడు పండు నా పొట్టమీద పడింది. కాస్త నా నోట్లో పెట్టిపొండి" అన్నాడు పడుకున్న ఒక సోమరి బాటసారితో.**

**బాటసారికి ఒళ్ళు మండి కర్రతో నాలుగు వడ్డించాడు.**

**"రోగం బాగా కుదర్చారు బాబూ! ఆ వెధవ యిందాక కుక్క నా మూతిమీద మూత్రం విడుస్తుంటే తోలకుండా పడుకున్నాడు" అన్నాడు వాడి ప్రక్కనే పడుకున్న మరొక మహాసోమరి.**

# అమెరికాలో మాతాజీ బోధ

-పరాశర ప్రసాద్

28-5-2011 U.S.A

భగవానుని అనుగ్రహం పొందటానికి సాధన చేయవలసిందే గదా! సాధనకి ఉపక్రమించిన ప్రతిసాధకుడూ ధ్యానం చేయటానికి ప్రశాంత వాతానరణం కోసం ఏకాంతంగా నిర్జన ప్రదేశంలో కూర్చోవాలి అని సంకల్పించటం సహజమే. అయితే అది సంభవమేనా? అసంభవము. మనస్సులో ప్రశాంతత కావాలని కోరుకోవచ్చు. కాని మనం ఉండేది బజారులోనేగా. తెల్లవారుఝామున లేచినా మనం చాల పనులు పెట్టుకుంటాము. మన దోషాన్ని మనం గుర్తిచం. అమెరికా రావాలని సంకల్పించాం. ఎన్ని పనులో చెప్పండి. బట్టలు సర్దుకోవాలి. ఏ ఏ వస్తువులు కావాలో ఆలోచించాలి. వాటిని సేకరించాలి. అవన్నీ సర్దుకోవాలి. ఎన్ని పనులో. ఎన్ని ఆలోచనలో! పోనీ మన జీవిత పరమార్ధాన్ని గురించి ఆలోచన చేస్తూన్నామా! మన మనస్సులో ప్రశాంతతని ఇచ్చే దానిని వదిలిపెట్టి ప్రశాంతతని పోగొట్టుకుంటున్నాము.

ప్రశాంతత బయట నుంచి రాదు. మన ధర్మం మన వెంటనే ఉంది. ప్రతి మానవుడు నిదుర పోవలసిందే. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులతో అలసిపోయిన దేహం విశ్రాంతిని కోరుకుంటుంది. అందువలన నిదుర పోవలసిందే. కాని విలువైన వస్తువులు, ధనము ఉన్న బ్యాగ్ నీ ప్రక్కనే ఉంది. నిదుర పడుతుందా? అంతకన్న విలువైన భగవానుడు నీకు భిన్నంగా లేడే. ఆయన నీలోనే ఉన్నాడు. ఆయనే లేకపోతే నీలో కదిలికలే ఉండవు. ఆ వస్తువు మనల్ని పట్టుకొని కాపాడుతోంది. మనం ఆ వస్తువుని పట్టుకోలేదు. మనం వివేకవంతులమై మన బుద్ధితో ఆ వస్తువుని గుర్తించి ఆస్వాదించి అనుభూతిని పొందాలి. ఆ వస్తువు ఉండబట్టే మన జీవితం నడుస్తోంది. అదే ఆత్మవస్తువు. అదే సత్యం. మనం సత్యంలోనే ఉన్నాం. సత్యం మనలోనే ఉన్నది. జగత్తు సత్యంలోనే ఉంది. సత్యానికి మార్పులేదు. కాని జగత్తుకి మార్పు ఉంది. కరెంటుని మనకి అందించే యంత్రాలన్నీ కరెంట్‌తోనే తయారయ్యాయి.

మనస్సు మంచిదే. మంచినే చేస్తుంది, మంచినే బోధిస్తుంది. మానవ మనుగడకు మనస్సే మూలం. మానవ ప్రయత్నం మనస్సుని జయించచాలనే కదా! లోపము మనస్సులో లేదు. మనస్సుని ఆవనరించిన ఆవరణలో దోషం

ఉంది. అందువలన మన మనస్సుని సంస్కరించుకోవాలి. దానికి ప్రధానమైనది సత్సంగము.

ముందుగా నీ దేహాన్ని సత్సంగంలో కూర్చోబెట్టాలి. సత్సంగంలో మీరు పాల్గొనేది ఎవరినో ఉద్ధరించటానికి కాదు. మిమ్మల్ని మీరు సంస్కరించుకోవటానికి ముందుగా సత్సంగ కార్యక్రమం అంటే ఇష్టం ఉండాలి. అంటే మనస్సు సత్సంగం అంటే అనురక్తిని కలిగి ఉండాలి. అంటే మీరు ప్రశ్నించవచ్చు 'ఏమిటండీ ప్రతి చిన్న విషయానికీ మీరు మనస్సు మనస్సు అంటున్నారు?' అని. ఇక్కడ మీకొక ఉదంతం చెబుతాను.

మన గురుదేవుల సందర్శనార్థం ఇంజనీర్లు వచ్చారు. వారికి గురుదేవులు బోధ చేస్తుంటే ఇంజనీర్లు గురుదేవులని ప్రశ్నిస్తూ 'ఏ మహాత్ములు బోధ చేసినా అంతఃకరణ శుద్ధి, అహంకార మమకారములు అని చెప్తారు. ఆధ్యాత్మికంగా ఇంతకన్న వేరేమీ లేదా?' అని అడిగారు. అప్పుడు గురుదేవులు వారికి సమాధానం చెబుతూ "మీ సబ్జెక్ట్ ఇంజనీరింగ్ కదా! మరి ఏ కన్‌స్ట్రక్షన్ ప్రారంభించినా యిల్లు అయినా లేక డ్యామ్ అయినా లేక ఫ్యాక్టరీ అయినా మీరు ముందుగా ప్లాన్ గీస్తారు. తరువాత ఏ కన్‌స్ట్రక్షన్‌కైనా ఇసుక, సిమెంట్, యిటుకరాళ్ళు తప్ప వేరే యేదైనా ఉపయోగిస్తారా!" అనేసరికి వారు వెంటనే విషయాన్ని గ్రహించి ఆధ్యాత్మిక పురోగతిని సాధించాలంటే ప్రధానంగా అంతఃకరణ శుద్ధి చెందవలసినదేనని అంతే కాక అహంకార మమకారాలను జయించాలనే విషయాన్ని గురుదేవుల ద్వారా తెలుసుకున్నారు.

అలాగే సాధకులు ప్రధానంగా మనస్సుని స్వాధీన పరచుకోనిదే దేనినీ సాధించలేరు. కాబట్టి నీ మనస్సుని సత్సంగంలో ఊరవేస్తే దాని యందు అనురక్తి కల్గి భగవంతుని గురించి ఆలోచన చేసే ప్రయత్నం చేయగల్గుతారు. సత్సంగంలో గడిపిన కాలం నిత్యకాలంలో జమ అవుతుంది. భగవంతుని గురించే ఆలోచించండి. మనం నమ్మిన దేవుడు ఎప్పుడు నా యందు మనస్సు నిలుపుతాడా అని ఎదురు చూస్తూ ఉంటాడు. అలా చేయగా చేయగా జన్మ జన్మల నుంచి ఆర్జించి, నీలో పేరుకుపోయిన కర్మ రహితం అవుతుంది.

రెక్కలు తెగిన పక్షులు ఎలా ఎగిరిపోతాయో అలాగే కర్మ రహితం అయిన మరుక్షణం మాసిన లేక చినిగిన షర్టుని ఎలా వదలివేస్తారో అలా ఈ దేహాన్ని త్యజిస్తారు. ఘటము విచ్ఛిన్నమవుతుంది.

తెల్లవారుజామున మనస్సు అణిగి ఉంటుంది కాబట్టి ప్రశాంత. తెల్లవారిన తరవాత మనస్సు ప్రపంచంలోకి వెడితే ఆందోళనే. ధ్యానానికి కూర్చుని భగవచ్చింతన మాని విషయ చింతన చేస్తే కర్మని మూటకట్టుకోక తప్పదు కదా! మనస్సు అదుపులోకి రావాలంటే కొన్ని ఎదురుదెబ్బలు తగలక తప్పదు. కష్టాన్ని యిష్టంగా తీసుకోవాలి. సాధకుడు ఆవేదనతో ప్రశాంత వాతావరణంలో సాధన చేసుకోవాలి. ఆవేదన చెందాలి. సత్యం మాటలకు అందేది కాదు. మాటలు బంధాన్ని తెస్తాయి. కాని సత్సంగం లోని మంచి మాటలు సత్యాన్ని అన్వేషించే మార్గాన్ని సూచించటంమే గాక పొందే మార్గాన్ని సూచించటమే గాక పొందే మార్గాన్ని సుగమం చేస్తాయి.

సృష్టి స్థితి లయాలకు కారణమయిన త్రిమూర్తులను సృష్టించిన నారాయణుడు, సర్వసృష్టి భగవంతునికి భిన్నం ఉన్నదా! ఖాళీ ప్రదేశంలో భవనాలు కట్టారు అనుకుందాం. ఇంతకు ముందున్న ఖాళీప్రదేశంలోనే కదా! భవనాలున్నది. అలాగే అనంతమైన విశ్వంలో జీవులు సృష్టించబడ్డాయి. సృష్టించినవన్నీ మార్పు చెందక తప్పదు. దేహము మార్పు చెందక తప్పదు.

మనము ఆత్మవస్తువును పట్టుకోలేదు. ఆత్మ వస్తువులోనే మనము ఉన్నాము. మనస్సు రాగద్వేషాలతోకూడి ఉన్నంత వరకు అశాంతి తప్పదు. జీవితానికి వచ్చింది చెప్పుడు మాటలు వినటానికి, వాటిని మోయటానికి కాదుకదా! బ్రతికి ఉండగానే చచ్చిపోవాలి. అంటే ప్రకృతి పరిణామంతో కూడినది అని గ్రహించి, దృష్టిని అనుసరించి, అనుభూతి ఉంటుంది అని తెలుసుకుని అవసరంలేని విషయాలను వదలితే శాంతి కాక మరేమిటి? మహాత్ములు అవతరించి సత్సంగాలలో ప్రబోధించేది ఎవరికోసం? వారికి సంకల్పాలు ఉంటాయా? వారికి స్వార్థం ఉంటుందా? వారికి బంధన ఉంటుందా? స్వార్థంగాని, కోరికగాని ఉంటే బంధన ఉంటుంది. సత్సంగాలు మన ఇల్లు మనం చక్కబెట్టుకోవటానికేగాని, వేరొకరికోసం కాదు అన్న విషయాన్ని ప్రతిసాధకుడు గుర్తించాలి. **ఉద్ధరే ఆత్మానాత్మానం** అనేది తెలుసుకోవాలి. పదిమందిలో ఉంటే సద్భావన పెంపొందుతుంది" అన్నారు శ్రీమాతాజీ.

■




(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

"కృష్ణుడు ఏమన్నాడు ఉద్ధవా?" రాధ కనులుమూయకుండా ఉద్ధవుని చూస్తూ అడిగింది.

కృష్ణుడు చెప్పింది ఏమిటంటే... రాధా... కృష్ణుడు... కృష్ణుడు ఇక లేడు..." హిమాలయాలను ఎక్కటానికి కూడా అంత శ్రమ ఉండదు. ఆ వాక్యం పూర్తి చేయటానికి అంత శ్రమ పడాల్సి వచ్చింది.. ఉద్ధవుడు ఆ వాక్యాన్ని పూర్తి చేసి అలిసిపోయాడు.

"కృష్ణుడు లేడా?" రాధ పకపకా నవ్వింది. ఏమిటి మీరు చెప్పేది ఉద్ధవా? స్వయంగా కృష్ణుడు చెప్పాడా కృష్ణుడు లేడు అని... ఈ చిన్న మాట చెప్పటానికి... ఆయన మిమ్మల్ని ఇక్కడికి పంపాడా? ఎంతటి కౌతుకత!.... కృష్ణుడు ఇక లేడు!" రాధ నవ్వులను వెదజల్లుతుంది.

రాధ... నువ్వు.... నువ్వు...... అర్థం చేసుకోలేదా!" ఉద్ధవుడు సందిగ్ధంలో పడ్డాడు. ఈ మాట రాధకు చెప్పటానికి ఎన్నాళ్ళనుంచో ఎలా చెప్పాలా అని బాధ పడ్డాడు. రాధ అదేమీ పట్టనట్లుగా నవ్వుతుంటే "నువ్వు...నువ్వు ఎందుకు నవ్వుతున్నావు?"

మీరు చెప్పేది విని నవ్వు రాదామరి!" రాధ వస్తున్న నవ్వును అపుకోవటానికి ప్రయత్నిస్తూ ఇలా అంది "మీరు ఆకాశాన్ని చూశారా ఉద్ధవా? కళ్ళతో ఆకాశాన్ని చూస్తూ అడిగింది." ఆకాశంవైపు ఉద్దవుడు చాశాడు. ఒకటి రెండు నక్షత్రాలు ఆకాశంలో ఉదయించాయి. రాధ తలలో విరిసే ఆ పూవులు ఆకాశంలోని నక్షత్రాలలాగ మెరుస్తున్నాయి.

"అక్కడ మీకు కాళింది కనిపిస్తోందా?" అని రాధ అడిగింది.

ఉద్ధవుడు ఆ చీకటిలో వెండిలా మెరుస్తున్న కాళిందిని చూశాడు.

మరి ఈ గాలి.... ఆ వృక్షం దగ్గర ఆ మయూర పింఛం... వీటిని మీరు చూస్తున్నారు కదా, అనుభవిస్తున్నారు కదా?" అంది రాధ ఉద్ధవుని చెవిలో.

"రాధా....ఏమిటి నువ్వు చెపుతున్నది? నువ్వు విషయం అర్థం చేసికోలేదు?" ఉద్దవుడు విసుగు కనబరిచాడు. "కృష్ణుని పార్థివ శరీరం ఇక మనకు లేదు..." అని అంతవరకు సంకోచిస్తూ చెప్పిన దానిని తిరిగి స్పష్టంగా చెప్పాడు.

రాధ గంభీరముద్ర దాల్చింది. రెప్పవాల్చకుండా ఉద్ధవుని చూసింది. "కృష్ణుని పార్థివ దేహమా?" రాధ ఉద్ధవుని చేయిపట్టుకొని పదండి మిమ్మల్ని ఆయన వద్దకు తీసికొని వెళ్తాను..." అని అంటూ ఉద్ధవుని లాక్కొని తీసుకువెళ్తుంటే... ఉద్దవుని కాళ్ళు తడబడుతున్నాయి... వేగంగా అడుగులు వేస్తున్న రాధ తనని లాక్కొంటూ వెళ్తోంది.

రాధా...రాధా...ఏమిటి నువ్వు చేస్తున్నది? అన్నాడు ఆమెను ఆపుతూ. కాని రాధ ఏమీ విననట్లుగా వేగంగా వెళ్తోంది. రాధను అనుసరించటం తప్ప వేరే గత్యంతరం లేదు ఉద్ధవుడికి.

గోకులంలోని నిశ్శబ్ద వీధులలో వీరి పదముల ధ్వని వినపడుతోంది.

"ఇదిగో ఆయన!" కొంచెం ముందుకు నడిచి ఒక చెట్టు పొదవైపు చూసి అన్నది. ఉద్ధవుడు అటు చూశాడు. ఎవ్వరూ కనపడలేదు.

"ఆ పిచ్చి పట్టిన రాధతో ఈ అపరిచితుడు ఎక్కడకు వెళ్తున్నాడు?అని ఎవరో ప్రశ్నించారు.

పిచ్చి రాధా?

ఉద్ధవుడు ఆగిపోయాడు!

గోకులంలో తను అపరిచితుడా?ఇంకేమీ కాడా?

రాధ ఏమీ వినలేదు. ఏదీ చూడలేదు. అడుగులు వేస్తూ ముందుకు సాగిపోతోంది. ఉద్ధవుడు కొంచెం ఆగాడు.

అయ్యలారా! గోపాలకుల వద్దకు వెళ్ళి "మీరు రాధను పిచ్చిది అంటున్నారేమిటి?" అని నెమ్మదిగా అడిగాడు

"ఆమె పిచ్చిది కాక మరేమిటి?" అన్నాడు వారిలో ఒకడు. "ఈమె పతి మరణించాడు. అయినా ఆమె సింగారించుకోవటం మానలేదు! మీరే చెప్పండి వైధవ్యం పొందిన స్త్రీ ఇటువంటి వస్త్రాలు ఇటువంటి అలంకరణలు చేసుకొంటుంటే ఆమెను పిచ్చిది కాకపోతే మరేమిటి?"

రాధ విధవరాలు!

ఒకక్షణం ఉద్ధవుడు ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు. అతని ముందు

సౌభాగ్య చిహ్న విహీనంగా విధవస్త్రీలు తన ఎదుట నించొని ఉన్నారు. రాధ వారిలాగా విధవ స్త్రీ ఎలా అవుతుంది? వైధవ్యంతో కూడిన మిగిలిన లక్షణాలు - అవస్థ, నిరాశ, ప్రౌఢత, సానుభూతి కోరే స్థితి - రాధలో ఈ లక్షణాలు ఏవీ లేవు. అంతేకాదు, రాధ నిన్నటి కన్నా ప్రసన్నంగా ఉంది! ఎన్నో సంవత్సరాల క్రింద ఎలా ఉందో అలాగే అంటే అంత యౌవ్వనంగా చైతన్యవంతంగా, అంత సమర్పణ భావంతో ఉంది....

ఇది ఎలా సంభవం?

మహాకాలుడు కూడా ఆగిపోయాడా?

"ఉద్ధవా...." చీకటిని చీలుస్తూ రాధ గొంతు వినిపించింది! ఉద్ధవుడు ముందుకు అడుగు వేశాడు.

కాళిందీ తటం వద్ద విశాల ఆకాశం క్రింద రాధ నిలబడి ఉంది.

ఇక్కడ ఉన్నాడు కృష్ణుడు ఉద్ధవా.. ఇక్కడ.." రాధ ఉద్ధవుని వైపు తిరిగి అంది, "మీరు పైన ఆకాశాన్ని చూస్తున్నారు... పారుతున్న కాళిందిని చూస్తున్నారు. గాలికి ఊగుతున్న తమాల వృక్షపు ఆకులను చూస్తున్నారు.... ఇవన్నీ ఉన్నాయి కదా... మరి మీరు కృష్ణుడు లేడు అంటారేమిట..? ఇది ఎలా సంభవం ఉద్ధవా?.,. అయితే మీరు కృష్ణుని పార్థివ శరీరం మాత్రమే చూస్తున్నారు?"

"మనమంతా దేహధారులం రాధా!" అన్నాడు ఉద్ధవుడు.

కృష్ణుని స్పర్శ సోకిన తరువాత కూడా దేహభావన మీలో ఉండటం, ఎంతో ఆశ్చర్యంగా ఉంది ఉద్ధవా? రాధ పకపకా నవ్వింది.

ఉద్ధవుడు ఆ హాస్య ప్రవాహంలో పూర్తిగా మునిగిపోయాడు! కాళింది ప్రవాహం కంటే ఎంతో సౌమ్యంగా ఉంది రాధ ఈ హస్య ప్రవాహం.

రాధ ఆకాశం కంటె ఉన్నత స్థానంలో ఉంది అనుకున్నాడు ఉద్ధవుడు...

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL